


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY



ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
ఆవుల విజయభాస్కర రెడ్డి
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి శుక్రవారం 08-07-2022 సంపుటి : 03 సంచిక : 284 పేజీలు : 4 వెల : రూ


## వాటిపై సీఎం జగన్ నూతన విధానం ప్రకటిస్తారు

ఎంపీ విజయసాయిరెడ్డి



తాడేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ప్లీనరీని అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుపుకుంటున్నామని పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన పార్టీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. 'ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేము ఎంతో నిర్మాణాత్మకంగా వ్యవహరించాం. అధికారంలోకి వచ్చాక కూడా అంతే నిర్మాణాత్మకంగా వ్యవహరించాము. సామాజిక న్యాయం దిశగా అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చాం. ప్లీనరీ విజయవంతం అవుతుందనడంలో ఎటువంటి అనుమానం లేదు. శుక్రవారం 1.50 లక్షల మంది, రెండో రోజు 4 లక్షల మంది వస్తారని అంచనా.బడుగు బలహీన వర్గాల్లో మంచి స్పందన కనిపిస్తోంది. ప్లీనరీ ఘనవిజయం చూసిన తర్వాత చంద్రబాబు వెక్కి వెక్కి ఏడుస్తాడు. వర్షం రాకుండా రెండు రోజులు మినహాయింపు ఇవ్వాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నాను. స్పెషల్ అహ్వానితులు ఎవరూ లేరు.. మా గౌరవ అధ్యక్షురాలు, పార్టీ అధ్యక్షులు హాజరవుతారు. ముందస్తు ఎన్నికలు వస్తే చంద్రబాబు సీఎం అవుతానని కలలు కంటున్నారు. ఆయన కలలు కళ్లలుగానే మిగిలిపోతాయి. పార్టీ కమిటీలకు సంబంధించి రేపటి రోజున అధ్యక్షులు ఒక నూతన విధానం ప్రకటిస్తారు. పార్టీని మరింత పటిష్టం చేసుకుని రాబోయే ఎన్నికలకు సిద్ధమవుతాం?' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.'సంక్షేమాన్ని నిలుపుదల చేయాలని చంద్రబాబు వ్యవస్థలను అడ్డు పెట్టుకుంటున్నాడు. ఒక్క స్కూల్ కూడా మూతపడలేదు.. కానీ 8వేల స్కూళ్లు మూతపడ్డాయి అంటాడు. పరిపాలనలో సంస్కరణలు తీసుకొచ్చి ప్రజల వద్దకే ప్రభుత్వం అనేది ప్రూవ్ చేశారు. చంద్రబాబు ప్రతి ఇంటికీ ఉద్యోగం.. లేదంటే నిరుద్యోగ భృతి అన్నా వీా హామీ ఏమైంది. చంద్రబాబు హయాంలో డిస్టిలరీలకు అనుమతిచ్చారు. మా ప్రభుత్వ హయాంలో ఒక్క డిస్టిలరీకి అనుమతివ్వలేదు. మా హయాంలో డీబీటీ ద్వారా రూ.1.40 లక్షల కోట్లు ప్రజలకు నేరుగా వెళ్లాయి. చేసిన మంచి పనులే ప్లీనరీలో చెప్తాం. విద్య, వైద్యం, మహిళా సాధికారత వంటి అంశాలను చర్చిస్తాం. ప్లీనరీకి డ్వాక్రా మహిళలను తరలిస్తున్నట్లు చంద్రబాబు ఆరోపణలు చేస్తున్నారు. మా పార్టీ కార్యకర్తలు, ప్రతినిధులు మాత్రమే ప్లీనరీకి హాజరవుతారు. వారికే మేము ఆహ్వానం పంపాం తప్ప డ్వాక్రా మహిళలకు కాదు' అని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

## ప్రస్తుత రోజుల్లో ప్రకృతి వ్యవసాయమే ఉత్తమ ఎంపిక: ఏపీ సీఎం జగన్

కడప: ప్రస్తుత రోజుల్లో ప్రకృతి వ్యవసాయమే ఉత్తమ ఎంపిక అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. రసాయనాలు కలిగిన ఆహారాల వల్ల అనేక రకాల క్యాన్సర్లు వస్తాయని, ఆహార ఉత్పత్తుల్లో రసాయనాలను తగ్గించాలంటే ప్రకృతి వ్యవసాయమే మార్గమని అభిప్రాయపడ్డారు. వైఎస్ఆర్ కడప జిల్లా పర్యటనలో భాగంగా గురువారం మధ్యాహ్నం పులివెందులులోని ఏపీకార్ల్‌లో న్యూటెక్ బయోసైన్సెస్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దాదాపు 6 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని సీఎం జగన్ చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామాలపై ఎక్కువగా దృష్టి సారించాలని, గ్రామస్థాయి నుంచి శిక్షణ అవసరమని సూచించారు. ఆర్‌బీకేల ద్వారా ప్రకృతి వ్యవసాయంపై రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు.సేంద్రియ వ్యవసాయంపై అంతర్జాతీయ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు తెలిపారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గించేందుకు ప్రభుత్వం తరపున అనేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు వివిధ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.




## పవర్‌గ్రిడ్‌కు సీబీఐ భారీ షాక్

ఆరుగురిని అరెస్ట్ చేసిన సీబీఐ

పవర్ గ్రిడ్ ఈడీ బీఎస్ ఝా నివాసంలో భారీ నగదు పట్టివేత

న్యూఢిల్లీ: టాటా పవర్ ప్రాజెక్టుల అవినీతి కేసులో పవర్ గ్రిడ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సహా ఆరుగురు సీనియనర్లను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) గురువారం అరెస్టు చేసింది. ఐదుగురు టాటా ప్రాజెక్ట్స్ ఎగ్జిక్యూటివ్‌లను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. నార్త్ ఈస్టర్న్ రీజినల్ పవర్ సిస్టమ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రాజెక్ట్‌లో అవినీతి ఆరోపణలపై తాజా పరిణామం చోటు చేసుకుంది. పవర్ గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీఎస్ ఝా, ఎగ్జిక్యూటివ్ వీపీ దేశరాజ్ పాఠక్, అసిస్టెంట్ వీపీ ఆర్ ఎన్ సింగ్ సహా ఐదుగురు సీనియర్ టాటా పవర్ ప్రాజెక్ట్స్ అధికారులను లంచం ఆరోపణలపై సీబీఐ గురువారం అరెస్ట్ చేసింది. అరెస్టయిన ఐదుగురు టాటా ప్రాజెక్ట్స్ ఎగ్జిక్యూటివ్‌లను పంచకుల కోర్టులో హాజరుపరచనున్నారు.

## జగన్ ప్రభుత్వంపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వ చర్యలు

ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే ఉండాలన్నచట్టం తెలియదా!

తెలుగు మీడియంలో విద్యాబోధన లేకుండా చేసేలా కనిపిస్తోంది




అమరావతి జూలై 7 స్కూళ్ల మూసివేత స్కూళ్ల విలీనం ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం తెలుగు మీడియం ఎత్తేయడం తదితర అంశాలపై జగన్ ప్రభుత్వంపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఏపీలో జగన్ ప్రభుత్వం చేపట్టిన స్కూళ్ల విలీనాలు మూసివేతలు తమకు ఇబ్బందికరంగా మారుతున్నాయని విద్యార్థులకు చదువుల్ని దూరం చేస్తున్నాయని దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు నిప్పులు చెరిగింది.విద్యా సంస్కరణల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్లను విలీనం చేసి మిగతా స్కూళ్లను మూసివేస్తారా అంటూ ప్రశ్నించింది. జాతీయ విద్యావిధానంతో పాటు విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయంటూ హైకోర్టు ఆక్షేపించింది. హైకోర్టు ఆగ్రహంతో ప్రభుత్వం వివరణ ఇవ్వడానికి రెండు రోజుల సమయం కోరింది.విద్యాసంస్కరణల పేరుతో జగన్ ప్రభుత్వం చేపడుతున్న స్కూళ్ల విలీనాలు మూసివేతలతో పాఠశాల విద్యావ్యవస్థ నిర్వీర్యమవుతోందంటూ పిటిషనర్లు హైకోర్టు దృష్టికి తెచ్చారు. టీచర్లు స్కూళ్ల సంఖ్యను తగ్గించే ప్రయత్నం చేస్తోందని పిటిషన్ లో పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతీ 30 విద్యార్థులకో టీచర్ ఉండాలని చెబుతున్నా దాన్నీ జగన్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కోర్టు దృష్టికి తెచ్చారు. స్కూళ్ల మూసివేతతో దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి రావడం వల్ల బాలికలు స్కూలు మానివేసే అవకావం ఉందని తెలిపారు.అలాగే ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లీష్ మీడియం అమలుపైనా జగన్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు గందరగోళంగా ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. 1 నుంచి 8వ తరగతి వరకూ ఒకే మీడియంలో విద్యాబోధన ఉంటుందని చెప్పిన ప్రభుత్వం అది ఏ మీడియం అనేది చెప్పకపోవడంపై పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. అలాగే 9 10 తరగతుల్లో రెండు మీడియాలు ఉంటాయని చెబుతూనే కనీసం 20 మంది విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం తీసుకోవాలని చెప్పడం కూడా సరికాదంటున్నారు.దీనిపై స్పందించిన హైకోర్టు.. ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే ఉండాలని విద్యాహక్కు చట్టం చెబుతోందని గుర్తుచేసింది. ప్రభుత్వ నిర్ణయం చూస్తుంటే తెలుగు మీడియంలో విద్యాబోధన లేకుండా చేసేలా కనిపిస్తోందని ఘాటు వ్యాఖ్యలు చేసింది.హైకోర్టు వ్యాఖ్యలపై అడ్వకేట్ జనరల్ శ్రీరాం.. నూతన విద్యావిధానం అమలు కోసం వివరాలు మాత్రమే సేకరిస్తున్నామని స్కూళ్ల తరలింపు విలీనాలు మూసివేతల ప్రక్రియ మొదలుకాలేదన్నారు. రెండు రోజుల సమయం ఇస్తే పూర్తి వివరాలు సమర్పిస్తామన్నారు. ఈ పిటిషన్లను డివిజన్ బెంచ్ కు బదిలీ చేసి విచారణ చేపట్టాలని కోరారు. దీంతో కోర్టు విచారణను వాయిదా వేసింది.

## రాజకీయాల్లో ఎవరూ అనివార్యం కాదు : బోరిస్ జాన్సన్

లండన్ : బ్రిటన్ ప్రధాని పదవికి బోరిస్ జాన్సన్ రాజీనామా చేశారు. కన్జర్వేటివ్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి కూడా తప్పుకున్నారు. ఈ సందర్భంగా జాన్సన్ ఉద్వేగంగా మాట్లాడారు. రాజకీయాల్లో ఎవరూ అనివార్యం కాదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో తాను విజయవంతం కానందుకు చింతిస్తున్నానని తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఉద్యోగాన్ని వదులుకుంటున్నందుకు బాధగా ఉందన్నారు. కన్జర్వేటివ్ పార్టీకి కొత్త నాయకుడు అవసరం అని వ్యాఖ్యానించిన జాన్సన్.. కొత్త ప్రధాని కూడా అవసరమని చెప్పారు. కొత్త నాయకుడికి తన మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని జాన్సన్ స్పష్టం చేశారు. ఇక ఉక్రెయిన్‌కు తమ మద్దతు ఇస్తూనే ఉంటామని బోరిస్ పేర్కొన్నారు.




## 45 మందితో కొలువుదీరనున్న మహారాష్ట్ర మంత్రివర్గం!

ముంబై : మహారాష్ట్ర నూతన మంత్రివర్గం 45 మందితో కొలువుదీరనున్నట్లు తెలుస్తోంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏక్‌నాథ్ షిండే ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రివర్గ కూర్పుకు తీవ్ర కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. అయితే మొత్తం 45 మందితో కొలువుదీరే మంత్రివర్గంలో బీజేపీ నుంచి 25 మంది మినిస్టర్లుగా ప్రమాణం చేసే అవకాశం ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన మరో 13 మంది కూడా మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశ ఉంది. ఈ 45 మందిలో చాలా మంది కొత్తవారే ఉంటారని వార్తలు వస్తున్నాయి.శివసేనకు చెందిన ఎమ్మెల్యే ఏక్‌నాథ్ షిండే.. బీజేపీ నాయకత్వంతో జతకట్టి ఉద్ధవ్ థాక్రే ప్రభుత్వాన్ని పడగొట్టి.. అధికార పీఠాన్ని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. మహారాష్ట్రలో బీజేపీ, శివసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. ఆ రాష్ట్ర సీఎంగా ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎంగా దేవేంద్ర ఫడ్నవీస్ ప్రమాణం చేశారు.



## ఈనాడు అసత్య కథనాలపై మంత్రి బొత్స ఫైర్



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలపై ఈనాడు తప్పుడు కథనాలు ప్రచురించిన నేపథ్యంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి బొత్స గురువారం మీడియాతో మాట్లాడుతూ.. "ప్రభుత్వ పాఠశాలలపై ఎల్లోమీడియా తప్పుడు కథనాలు రాసింది. రాష్ట్రంలో ఒక్కబడి కూడా మూతపడలేదు. ఏ పాఠశాల మూతపడిందో చూపించాలి. దేశ చరిత్రలోనే విద్యారంగంలో సంస్కరణలు మన రాష్ట్రంలోనే జరుగుతున్నాయి. ఈ సంస్కరణలు నూతన విద్యా విధానానికి అనుగుణంగానే సాగుతున్నాయి. ప్రతీ ఒక్కరికీ విద్య అందాలని మేము ప్రయత్నం చేస్తున్నాము. పాఠశాల స్థాయి నుంచి ఉత్తమమైన విద్య అందించడం కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారు. బడి ఎక్కడ మాయమైందో రామోజీరావు చెప్పాలి. చదువుల్లో మీకు గందరగోళం వచ్చింది. ఈ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని మీకు గందరగోళానికి గురవుతున్నారు. ఈ రాతలన్నీ పట్టుకుని చంద్రబాబు మాట్లాడతాడు. డ్రాప్ ఔట్స్ తగ్గించి పిల్లల్ని బడి బాట పట్టించడానికి అమ్మఒడి పెట్టాము. రాష్ట్రంలో 42,750 స్కూల్స్ ఉన్నాయి. 5,280 స్కూల్స్ మాత్రమే మ్యాపింగ్ చేసాము. సెంట్రల్ స్కూల్స్ విధానం తీసుకుని సబ్జెక్ట్ టీచర్స్‌ను పెట్టాము. ఈ విధానం వల్ల మీకు వచ్చిన ఇబ్బంది ఏమిటి?. కేరళ, గుజరాత్‌కు ధీటుగా ఇక్కడి విద్యార్థులు నిలబడాలని ఇవన్నీ చేస్తున్నాము. చంద్రబాబు విద్యాకానుక ఐటమ్స్ ఇచ్చాడా?. బైజూస్ వల్ల 40 లక్షల మందికి లబ్ది చేకూరుతోంది. ప్రభుత్వంపై అవాస్తవ కథనాలను ప్రచురిస్తున్నారు. రాజకీయ లబ్ధికోసం లేనిది ఉన్నట్టుగా చూపించే కుట్ర జరుగుతోంది. అమ్మఒడి పథకంపై ఎల్లో మీడియాకు కడుపుమంటగా ఉంది. ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెడితే వారికి ఏంటి ఇబ్బంది?. పాఠశాల విద్యను పటిష్టం చేసేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. కొంతమంది ప్రతీ అంశాన్ని రాజకీయం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల విద్యార్థులతో పోటీపడే విధంగా శిక్షణ ఇస్తున్నాము" అని తెలిపారు.

## వైసీపీ ప్లీనరీకి సర్వం సిద్ధం.. పార్టీ శాశ్వత అధ్యక్షుడిగా జగన్!

గుంటూరు: అత్యంత ప్రతిష్టత్మకంగా భావిస్తున్న వైసీపీ ప్లీనరీ సమావేశాలకు ఆ పార్టీ నేతలు సర్వం సిద్ధం చేశారు. నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలోని మైదానంలో రేపటి నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ప్లీనరీ సమావేశాలు రెండు రోజుల పాటు కొనసాగనున్నాయి. వైసీపీ శాశ్వత అధ్యక్షుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నియమించే తీర్మానంతో పాటు పలు రాజకీయ తీర్మానాలను ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టి ఆమోదించనున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు మార్గదర్శనం చేసే పలు అంశాలపై లోతుగా చర్చించనున్నట్లు సమాచారం.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి రోజున వైసీపీ ప్లీనరీ సమావేశం శుక్రవారం ఉదయం 8 గంటలకు కార్యకర్తల రిజిస్ట్రేషన్‌తో ప్రారంభమవుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేండ్లకు ఈ ప్లీనరీని నిర్వహిస్తున్నారు. ఈ ప్లీనరీలో పలు తీర్మానాలు, పార్టీ రాజ్యాంగ సవరణపై కసరత్తులు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తున్నది. ఈ ప్లీనరీ వేదిక నుంచి పార్టీ తీసుకునే కీలక నిర్ణయాలను వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మూడు రాజధానుల విషయంలో లోతుగా చర్చించి.. పార్టీ అభిప్రాయాన్ని మరోసారి స్పష్టం చేసేందుకు నడుం బిగించినట్లు తెలుస్తున్నది.ఇప్పటివరకు ప్లీనరీలో పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకునే ఆనవాయితీ ఉండగా.. ఇప్పుడు పార్టీ రాజ్యాంగానికి సవరణలు తీసుకొచ్చి పార్టీ శాశ్వత అధ్యక్షుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండేలా తీర్మానం ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. 12 సంవత్సరాలుగా జగన్ వైసీపీ అధ్యక్షుడిగా ఉన్నారు. ఇందులో తొమ్మిది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి ఈ ప్లీనరీ జరగనుంది. 2017లో వైసీపీ ప్లీనరీ జరిగింది. మరోవైపు రేపు దాదాపు 1.50 లక్షల మంది ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ప్లీనరీకి హాజరయ్యే అవకాశముందని తెలుస్తున్నది. వీరి కోసం ఘుమఘుమలాడే వంటకాలను సిద్ధం చేస్తున్నారు.శుక్రవారం ఉదయం 10.30 గంటలకు దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి సీఎం జగన్ నివాళులర్పిస్తారు. అనంతరం సర్వమత ప్రార్థనలు ఉంటాయి.



# సంపాదకీయం

శుక్రవారం 08-07-2022

## వివాదాలు...ప్రమాదాలు

మత సంబంధమైన సున్నిత అంశాలకు సంబంధించి మాట్లాడే సమయంలో ఎవరైనా, కొంత జాగ్రత్త వహించడం అవసరం. అయితే, ఈ మధ్య కాలంలో దేశంలో, ఇలాంటి అంశాలు వివాదం అవుతున్నాయి. వివాదం అవడమే కాదు, విషాద పరిణామాలకు దారి తీస్తున్నాయి. అయినా, రాజకీయ ప్రముఖులు. మీడియా, చివరకు నాయవ్యవస్థ, న్యాయమూర్తులు కూడా,లక్ష్మణ రేఖ, దాతుతున్నారనే ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. భావప్రకటన స్వేచ్ఛ పేరిట చర్చలు జరుగుతూనే ఉన్నాయి. పరస్పర విరుద్ధ వాదనలు, వివాదాలు టీవీ చానల్స్ స్టూడియోలో పురుడు పోసుకుంటున్నాయి. ఇప్పుడు ఇదే క్రమంలో మరో వివాదం తెర మీదకు వచ్చింది. ఒక ప్రముఖ టీవీ చానల్ నిర్వహించిన ఓ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ మహువా మొయిత్రా, కాళీమాత గురించి వ్యక్తపరిచిన అభిప్రాయలు, ఆమె చేసిన వ్యాఖ్యలు వివాదాస్పద మయ్యాయి. ప్రముఖ దర్శకురాలు, రచయిత్రి, నటి లీనా మణిమేగలై కాళీ పేరిట ఒక లఘు చిత్రం తీశారు. కొద్ది రోజుల క్రితం ఈ చిత్రానికి సంబంధించి పోస్టర్' ను విడుదల చేశారు. ఈ పోస్టర్'లో కాళీ మాత ధూమపానం చేస్తునట్లు చూపించడం వివాదంగా మారింది. ఓ వంక ఆ వివదం అలా నడుస్తున్న సమయంలోనే, జాతీయ టీవీ చానల్ ' నిర్వహించిన చర్చా కార్యక్రమంలో పాల్గొన్న, మహువా వివాదానికి రాజకీయ వివాదానికి తెర తీశారు. అఫ్కోర్స్, టీవీ యాంకర్ అడిగిన ప్రశ్నకు సమాధానంగానే ఆమె స్పందించారు. అయితే,ఇప్పటికే దేశంలో ఒక విధమైన మత ఉద్రిక్తలకు పురిగొలిపే, వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, ఆమె సమాధానాన్ని దాటవేసి ఉంటే. లేదా మరికొంత సున్నితంగా జవాబు ఇచ్చి ఉంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ, ఆమె అదేమీ పట్టించుకున్నట్లు లేదు. ఆమె తమ సహజ ధోరణిలో స్పందించారు. ఆమె స్పందించిన తీరుకు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సొంత పార్టీ టీఎంసీ కూడా ఆమె మాటలపై అభ్యంతరం వ్యక్తం చేసింది.ఆమె వ్యాఖ్యలతో, పార్టీకి సంబంధం లేదని, అధికారికంగా ప్రకటించింది. అయినా, మహువా మాత్రం తమ వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నానని అంటూనే వివరణ ఇచ్చారు. ఏ చిత్రానికి, ఏ పోస్టర్‌కు మద్దతు ఇవ్వలేదన్నారు. అలాగే, ధూమపానం అనే పదాన్ని వాడలేదని అన్నారు. అదే సమయంలో ఆమె, ఈ పరిణామాల మధ్యనే ఆమె టీఎంసీ అధికారిక ట్విటర్ ఖాతాను అన్‌ఫాలో చేయడం చర్చనీయాంశంగా మారిందిమరోవంక మతపరమైన వ్యాఖ్యలు చేసిన టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై కేసు నమోదైంది. సినిమా పోస్టర్‌ను ఉద్దేశించి ఆమె చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీసిన నేపథ్యంలో ఆమెను అరెస్టు చేయాలని బీజేపీ నేతలు చేసిన ఫిర్యాదు మేరకు, పోలీసులు ఆమె ఆపై కేసు నమోదు చేశారు. మరోపక్క తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడానికి మహువా నిరాకరించారు. బెంగాలీలు ఆరాధించే దేవతామూర్తి నిర్భయమైందంటూ ట్వీట్ చేశారు.'నేను కూడా కాళీ మాత ఆరాధకురాలినే. మీ గుండాలకు, మీ పోలీసులకు, మరీ ముఖ్యంగా మీ ట్రోల్స్‌కు.. దేనికీ నేను భయపడను. నిజం చెప్పేందుకు ఇతర శక్తుల మద్దతు అవసరం లేదు' అంటూ గట్టిగా బదులిచ్చారు.ఇప్పటికే, బీజేపీ మాజీ నేత నృపూర్ శర్మ, ముహ్మద్ ప్రవక్తకు సంబంధించి చేసిన వివాదస్పద వ్యాఖ్యలు ఉద్రిక్తతలు సృష్టిస్తున్న నేపథ్యంలో, మహువా వ్యాఖ్యలు ఎటు దారి తీస్తాయి అనేది సామాన్యుల నుంచి మేథావుల వరకు అందరినీ ఆందోళనకు గురిచేస్తోందని అంటున్నారు.

# వలంటీర్ల వ్యవస్థకు ఎసరు...

విజయవాడ, జూలై 7, ప్రజలలో వ్యతిరేకత వైసీపీపై కాదు.. వైసీపీ ఎమ్మెల్యేలపై కాదు వ్యతిరేకత అంతా వాలంటీర్లపైనే.. ఇదీ వైసీపీ నేతలు ఇప్పుడు ముక్తకంఠంతో చెబుతున్న మాట. మనం నియమించిన వాళ్లు వాలంటీర్లు ఇప్పుడు వారి వల్లే మనకు ఇబ్బంది ఎదురౌతోందనుకుంటే వాళ్లని తొలగించేద్దాం అదెంత సేపు అన్నదే ఇప్పుడు వైసీపీ నేతలు చెబుతున్న మాట. పార్టీ ప్లీనరీలకు ముందు నిర్వహించిన జిల్లాల ప్లీనరీలలో నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ ఇదే విషయం చెప్పారు.పార్టీ బలోపేతం, పార్టీ అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు ఇలా వేటి గురించీ జిల్లా ప్లీనరీలలో చర్చించలేదు. అందరూ వాలంటీర్లను ఆడిపోసుకోవడానికే పరిమితమయ్యారు. తానేటి వనిత, దాడిశెట్టి రాజా, అంబటి రాంబాబు ఇలా మంత్రులందరిదీ దాదాపు ఒకటే మాట.. వాలంటీర్ల వల్ల మనం ప్రజలలో చులకన అవుతున్నాం. వారిని తొలగించేద్దాం అనే. ఎమ్మెల్యేలు, నాయకులూ కూడా వారికి వంత పాడారు. అదే సమయంలో వాలంటీర్లు అందరూ వైసీపీవారే అని కూడా అంటున్నారు. ఇదేం తిరకాసో అర్థం కాక రాజకీయ పండితులు సైతం తలలు పట్టుకుంటున్నారు. ఇంతకీ అసలు విషయమేమిటంటే...పథకాల లబ్ధిదారుల ఎంపిక నుంచి ప్రతి విషయాన్నీ వాలంటీర్లకు అప్పగించిన జగన్ నియోజకవర్గాలలో, గ్రామాలలో, వార్డులలో వారిదే పెత్తనంగా మార్చేశారు. దీంతో ఎమ్మెల్యేలు, ఆఖరికి మంత్రులు కూడా వారి వారి ఇలాకాలలో డమ్మీలుగా మారిపోయారు.ప్రజలకు దూరమయ్యారు. ఏ పనీ చేయలేక నిస్సహాయులుగా మిగిలిపోయారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ వారిలో ఆందోళన, అలజడి ఆరంభమైంది. తమ వారి వద్ద తమ పలుకుబడి చూపించుకోవాలంటే నెపం వాలంటీర్లపై నెట్టేయడమే మార్గమని భావిస్తున్నారు. వాలంటీర్లు వారికి ఇచ్చిన అవకాశాలను దుర్వినియోగం చేసుకుని వ్యవస్థలో జొరబడి అస్తవ్యస్తం చేసేశారని నిందిస్తున్నారు. వారిని తొలగించేద్దామనీ, ఆ తరువాత మనదే రాజ్యమని కింది స్థాయి క్యాడర్ కు నచ్చ చెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు.ప్రజలకు ప్రజాప్రతినిధులకు వారధిగా ఉంటారన్న ఉద్దేశంతో జగన్ ఏర్పాటు చేసిన వాలంటీర్ల వ్యవస్థ ప్రజా ప్రతినిధులను డమ్మీలను చేసేలా మారిపోయిందన్న అసంతృప్తి వైసీపీ ఎమ్మెల్యేలలో చాల కాలంగా ఉంది. ఇంత కాలం లోపల్లోపల దాచుకున్న ఈ అసంతృప్తినీ, ఆగ్రహాన్నీ జిల్లా ప్లీనరీలలో ఒక్క సారిగా వెల్లగక్కేశారు. అసలే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ తరువాత పార్టీలో అసంతృప్తులతోనే సమస్యలు ఎదుర్కొంటున్న పార్టీ అగ్ర నేతలకు ఇప్పుడు వాలంటీర్లపై ప్రజా ప్రతినిధుల ఆగ్రహం కొత్త తలనొప్పులను తీసుకువస్తోంది. వెరసి ఇది వాలంటీర్ల ఉద్యోగాలకు ఎసరు తీసుకువచ్చే వరకూ వెళ్లింది. ఇప్పటికే రెగ్యులరైజేషన్ విషయంలో అసంతృప్తితో ఉన్న వాలంటీర్లు ఇప్పుడు తొలగింపు అంటూ పార్టీ కొత్త పల్లవి ఎత్తుకోవడంతో రగిలిపోతున్నారు. మొత్తం మీద ప్రతి నియోజకవర్గంలోనూ ప్రతి కుటుంబం వైసీపీ వైపే ఉండేందుకు జగన్ వ్యూహాత్మకంగా ఏర్పాటు చేసిన వాలంటీర్ల వ్యవస్థ ఇప్పుడు మొదటికే మోసం అన్నట్లుగా తయారైంది. ఇటు పార్టీ క్యాడర్ లోనూ.. అటు ప్రజలలోనూ వాలంటీర్లపై ఆగ్రహం పెల్లుబుకుతుండటం.. ఆ వ్యవస్థ వల్లే పార్టీ కేడర్ కు ప్రజలకు మధ్య సంబంధాలు తెగిపోవడం.. ఇప్పుడు వారిని తొలగిస్తే మిగిలిన స్వల్ప వ్యవధిలో మళ్లీ నియోజకవర్గాల వారీగా, వార్డుల వారీగా, గ్రామాల వారీగా పథకాల లబ్ధిదారుల వద్దకు నేరుగా ప్రజా ప్రతినిధులను పంపి పథకాల ప్రచారంతో ఊదరగొట్టే సమయం లేకపోవడంతో వైసీపీలో ఆందోళన పెరుగుతోంది. ఏం చేయాలో తెలియక సభల్లో, సమావేశాల్లో వాలంటీర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వారిని తొలగించేద్దామంటూ కేడర్ కు చెబుతూ పరిస్థితి మరింత దిగజారకుండా జాగ్రత్త పడుతున్నారు.

# వైసీపీలో పెరుగుతున్న రఘురామరాజులు ...?

తిరుపతి, జూలై 7, వైసీపీలో అసమ్మతి రాజుకుంటోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలలో ఇంత కాలం నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి, అసమ్మతి ఇప్పుడు రాజుకుని మంటగా మారుతోంది. పార్టీకి హైకమాండ్ అంటే అధినేత జగన్ మాత్రమే. అసమ్మతి ఇప్పుడు అధినేతను ధిక్కరించడానికి సైతం వెనుకాడని పరిస్థితి కనిపిస్తోంది. ఇంత కాలం వైసీపీలో అసమ్మతి అంటూ ఎవరైనా బహిరంగంగా బయటకు వచ్చారంటే అది రెబల్ ఎంపీ రఘురామ రాజు మాత్రమే.ఆయన ధిక్కారాన్ని సహించలేని అధినేత జగన్ ఆయన పట్ల వ్యవహరించిన తీరు తెలిసిందే. ఏపీ సీఐడీ పోలీసులు ఆయనను అరెస్టు చేసి భౌతికంగా హింసించారంటే దాని వెనుక ఉన్నది ఎవరో ఎవరైనా తేలిగ్గా ఊహించగలరు. ధిక్కారాన్ని, అసమ్మతి స్వరాన్ని అధినేత సహించడని స్పష్టంగా తెలిసినా కూడా పార్టీలో అసమ్మతి గళం పైకి లేస్తున్నదంటే పార్టీలో అసంతృప్తి ఎంతగా పేరుకుపోయిందో ఇట్టే అవగతమౌతుంది.తాజాగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి తన నిరసనను పార్టీ అధినేతకు దిమ్మతిరిగేలా వినిపించారు. గత కొంత కాలంగా ఆయన సుతిమెత్తగా తన అసమ్మతిని, అసంతృప్తినీ వ్యక్త పరుస్తూనే ఉన్నారు. అయితే మంగళవారం ఆయన తన నిరసనను వ్యక్తం చేసిన తీరు పార్టీ వర్గాలనేగ్గ్భ్రమకు గురి చేసింది. వైసీపీ ప్రభుత్వ తీరుకు నిరసనగా ఆయన నేరుగా డ్రైనేజీలోకి వెళ్లి కూర్చున్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో డ్రైనేజీ పనులకు నిధులు కేటాయించడం లేదనీ, కార్పొరేషన్ అధికారులు ఎమ్మెల్యేనైన తన మాటలు వినడం లేదని ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. ఎమ్మెల్యేగా తాను కోరుతున్నా డ్రైనేజీ పనులకు నిధులు కేటాయించడం లేదంటే ఏమనుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. నిరసనకు సంఘీ భావంగా ఆయన అనుచరులు కూడా డ్రైనేజీలోకి దిగారు. ఈ మొత్తం సోషల్ మీడియాలో వైరల్ అవ్వడమే కాకు పెద్ద చర్చకు శ్రీకారం చుట్టింది. రోడ్లు, డ్రైనేజీలు వంటి పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం ఒక్క నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కాదనీ, రాష్ట్ర వ్యాప్తంగా ఏ నియోజకవర్గంలోనూ కూడా ఇటువంటి పనులకు ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదనీ, ఇది అందరికీ తెలిసిన విషయమేనని వైసీపీ వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి తెలిసి కూడా ఎమ్మెల్యే కోటం రెడ్డి ఇలా బహిరంగ నిరసనకు దిగడం పార్టీని ప్రజలలో పలుచన చేయడానికేనని పార్టీ వర్గాలు అంటున్నాయి. తనకు మంత్రి పదవి రాలేదన్న అసంతృప్తికి తోడు, తనతో అంతగా సఖ్యత లేని కాకాణికి మంత్రిపదవి ఇవ్వడంతో పెచ్చరిల్లిన అసహనంతో గత కొద్ది కాలంగా కోటం రెడ్డ పార్టీని భ్రష్టు పట్టించే విధంగా వ్యవహరిస్తున్నారని పార్టీ వర్గాలు అంటున్నాయి. అయితే ఒక్క కోటం రెడ్డే కాదు.. ఇంకా పలువురు ఎమ్మెల్యేలు, కొందరు మంత్రులూ కూడా బహిరంగంగానే పార్టీ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రకటనలూ ప్రసంగాలూ చేస్తున్నారు. ఇటీవల బొత్స కూడా విజయనగరం జిల్లాలో ప్లీనరీ సదస్సులో మాట్లాడుతూ పార్టీ క్యాడర్ నాయకత్వం మీద విశ్వాసం కోల్పోతోందనీ, వారు పార్టీని వీడే ఆలోచన చేస్తున్నారనీ చెప్పడమే కాకుండా ఇప్పటికైనా

మేలుకోకపోతే పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందని కుండ బద్దలు కొట్టారు. అంతకు ముందు సమీక్షా సమావేశంలోనే బాలినేని వంటి నేతలు పార్టీలో అసమ్మతి, పనులు జరగకపోవడంతో ప్రజలలో పెల్లుబుకుతున్న ఆగ్రహం గురించి అధినేత ఎదుటే గళమెత్తారు. ఇక జోగి రమేష్ అయితే ప్రభుత్వ సలహాదారు సజ్జల సమక్షంలోనే సంచలన వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేతలకు కొందరు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారని కుండబద్దలు కొట్టారు. ముఖ్యంగా మాజీ మంత్రి వెల్లంపల్లి ఈ రోజు వైసీపీలోనే ఉన్నా ముందు ముందు ఉంటారన్న నమ్మకం లేదని అన్నారు.మాజీ మంత్రి బాలినేని విషయం కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. సొంత పార్టీ నేతలే తనకు వ్యతిరేకంగా కుట్ర చేస్తున్నారని ఆయన పలు సందర్భాలలో బహిరంగంగా చెప్పారు.గుడివాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి నాని అయితే గన్నవరం, బందర్ నియోజకవర్గాలలో వచ్చే ఎన్నికలలో పార్టీ అభ్యర్థులు ఎవరన్నది ప్రకటించేసి ఆయా నియోజకవర్గాలలో ఇప్పటికే ఉన్న గ్రూపు తగాదాలకు అజ్యం పోశారు. ఇలా ఇక్కడ ప్రస్తావించిన జిల్లాలలోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వైసీపీలో గ్రూపు తగాదాలు శృతి మించి రాగానపడ్డాయని పార్టీ వర్గాలే అంగీకరిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే నియోజకర్గానికి ఒక రఘురామరాజు తయారైనా ఆశ్చర్యపోవలసిన పని లేదని పరిశీలకులే కాదు, వైసీపీ శ్రేణులు సైతం అంటున్నాయి

# రైతులకు అరటి లాభాల పంట



కర్నులూ, జూలై 7, ఈ ఏడాది అరటి సాగు చేసిన రైతులకు లాభాల పంట పండుతోంది. కాస్త ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ నికరంగా ఆదాయం తెచ్చిపెడుతుండటంతో రైతులు అరటి సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ఉత్సాహంగా పండ్ల తోటలు సాగు చేస్తున్నారు. నంద్యాల జిల్లా పరిధిలో ఈసారి సుమారు 10 వేల ఎకరాల్లో అరటి తోటలు సాగవుతున్నాయి. ముఖ్యంగా మహానంది, ప్యాపిలి, ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం తదితర మండలాల్లోని రైతులు అధికంగా అరటి తోటల పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. రెండేళ్ల నుంచి ధర అంతంత మాత్రమే ఉన్న అరటి గెలల ధరలు ఇటీవల ఒక్కసారిగా భారీగా పెరిగాయి. రెండు నెలల వరకు టన్ను రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు ధర పలికింది. ఒక్కో సమయంలో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు రాక తోటలోనే వదిలేసిన సంఘటనలు ఉన్నాయి. అయితే అనూహ్యంగా జూన్ నుంచి ధరలు పెరగడం మొదలు కాగా ప్రస్తుతం ధరలు మరింత పెరిగి టన్ను రూ.20 వేల నుంచి రూ.25 వేల పైగానే ధర పలుకుతోంది.ప్రస్తుతం జీ9 రకం అరటికి మంచి గిరాకీ ఉంది. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలతో పాటు కృష్ణా, ఉభయ గోదావరి తదితర ప్రాంతాల్లో అరటి దిగుబడులు లేకపోవడంతో ప్రస్తుతం రాయలసీమ అరటి గెలలకు మంచి డిమాండ్ వచ్చింది. కేరళ, తమిళనాడు, బిహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ధర ఊహించిన దానికంటే ఎక్కువగా పలుకుతుండటంతో నిన్నటి మొన్నటి వరకూ ధరలేక నష్టపోయిన రైతులు పెరిగిన ధరను చూసి ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. నంద్యాల జిల్లాలోని వివిధ మండలాల్లో సుమారు 10 వేల ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నారు. ఎకరాకు 1,200 మొక్కలు (టిష్యూ కల్చర్) చొప్పున రూ.60 వేలు ఖర్చు చేసి నాటుతున్నారు. సాగు ఖర్చులు, మందులకు అంతా కలిపి ఎకరాకు మరో రూ..40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుంది. కౌలు రైతుకు అయితే మరో రూ.30 వేలు అదనంగా అవుతుంది. 1,200 మొక్కల్లో కనీసం 900 నుంచి 1,000 చెట్లు గెలలు తెగినా సరాసరి 30 నుంచి 40 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం ఉన్న ధర ఉంటే ఖర్చులు పోను ఎకరాకు రూ.4 లక్షల వరకు ఆదాయం లభిస్తుంది. అరటి తోట సాగుకు తొలిసారి మాత్రమే ఖర్చు అధికంగా ఉంటుంది. రెండో ఏడాది ఎక్కువగా ఉండదు. కాండం నుంచి వచ్చిన ఐదారు పిలకల్లో మంచి పిలకను ఎంచుకుని మిగతావి తీసి వేస్తే సరిపోతుంది. దీంతో విత్తనం ఖర్చు సుమారు ఎకరాకు రూ.60 వేల వరకు తగ్గుతుంది. సేద్యాల ఖర్చు ఉండదు. ఎరువులు కూడా పెద్దగా అవసరముండక పోవడంతో రైతన్నలకు ఖర్చు తగ్గి ఆదాయం పెరుగుతుంది. ఏరియా, వాతావరణ పరిస్థితులను బట్టి ఆ ప్రాంతంలో సాగుకు అవసరమైన నాణ్యమైన టిష్యూ కల్చర్ మొక్కల నుంచి మైక్రో ఇరిగేషన్, సమగ్ర సస్యరక్షణ (ఐఎన్ఎం), సమగ్ర ఎరువులు, పురుగుల మందుల యాజమాన్యం (ఐపీఎం) ఫ్రూట్ కేర్ యాక్టివిటీ వరకు ఒక్కో రైతుకు గరిష్టంగా హెక్టార్‌కు రూ.40 వేల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూత ఇస్తోంది. తోట బడుల ద్వారా రైతులకు సాగులో మెలకువలపై శిక్షణ ఇస్తున్నారు. సాగుచేసే ప్రతి రైతుకు గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీసెస్ సర్టిఫికేషన్ (జీఏపీ) ఇస్తారు.

## మూడేళ్ల తర్వాత కేడర్ దగ్గరకు...

విజయవాడ, జూలై 7, వైసీపీ ప్లీనరీకి సమయం దగ్గర పడుతుంది. ఇప్పటి వరకూ పార్టీ క్యాడర్ ను వైసీపీ ఎమ్మెల్యేలు పట్టించుకోలేదు. ఎమ్మెల్యేలు అనేకంటే జగన్ కూడా క్యాడర్ ను దూరంగా పెట్టారనే చెప్పాలి. ఏ కార్యక్రమానికి వెళ్లినా వారితో పెద్దగా కలిసింది లేదు. అధికార కార్యక్రమం కావడంతో తాను చెప్పదలచుకున్న మూడు ముక్కలు చెప్పేసి, చేతులూపి తిరిగి తాడేపల్లికి చేరుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో క్యాడర్ కు జరుగుతున్న అన్యాయం జగన్ దృష్టికి వెళ్లకపోయి ఉండవచ్చు. వెళ్లి ఉండవచ్చు. చెప్పలేం. కానీ జగన్ కూడా క్యాడర్ విషయంలో మూడేళ్ల పాటు చూసీ చూడనట్లు వ్యవహరించారన్నది వాస్తవం. గత ఎన్నికల్లో వైసీపీ విజయానికి కృషి చేసిన గ్రామస్థాయి క్యాడర్ పూర్తి స్థాయిలో అసంతృప్తిలో ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యేల వద్దకు కూడా వారు రావటం మానేశారు. అతికొద్ది మంది ఎమ్మెల్యేలు మాత్రమే క్యాడర్ తో కలివిడిగా ఉంటున్నారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన క్యాడర్ పై నిర్లక్ష్యం పార్టీకి ఎన్నికల్లో ఇబ్బందులు ఎదురవుతాయి. బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలంటే కార్యకర్తలే ఏ పార్టీకైనా దిక్కు. వైసీపీ దానికి మినహాయింపు కాదు. జగన్ వాలంటీర్లను నమ్ముకుంటే వారు చివరి క్షణంలో పుట్టి ముంచినా పెద్దగా ఆశ్చర్యపోనవసరం లేదు. అందుకే వైసీపీ ప్లీనరీ తర్వాత క్యాడర్ ను దగ్గరకు చేర్చుకునే ప్రయత్నాలు జగన్ మొదలు పెడతారంటున్నారు. ప్లీనరీలో బహిరంగంగా ప్రకటించకపోయిప్పటికీ దాని తర్వాత పార్టీ క్యాడర్ కు 119 నియోజకవర్గాల్లో ప్రాధాన్యత దక్కేలా జగన్ చర్యలు తీసుకుంటారంటున్నారు. ఇందుకోసం ఏమేం చేయాలో చూడాలని ఇప్పటికే జగన్ పార్టీ సీనియర్ నేతలను కోరినట్లు తెలిసింది. వైసీపీ ఎన్నికల వ్యూహకర్త రుషిరాజ్ సింగ్ టీం కూడా క్యాడర్ లో ఉన్న నిరాసక్తతను నివేదిక రూపంలో వెల్లడించినట్లు సమాచారం. క్యాడర్ తో పాటు ప్రధానంగా జగన్ పార్టీకి గత ఎన్నికల్లో అండగా నిలిచిన సోషల్ మీడియా టీం కు అసంతృప్తితో ఉన్నారు. కొందరు బహిరంగంగానే ఎమ్మెల్యేలపై తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వీరి బాధ్యతలను రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి అప్పగించారు. వారిని ఈ రెండేళ్ల పాటు మరింత ప్రోత్సహించేలా జగన్ నేరుగా కొన్ని చర్యలు తీసుకుంటారని వినికిడి. ప్లీనరీ తర్వాత వారితో ప్రత్యేకంగా కూడా సమావేశమయ్యే అవకాశముంది. అయితే దాదాపు మూడేళ్ల తర్వాత పార్టీ క్యాడర్ జగన్ కు అతి చేరువగా వస్తుండటంతో వారి నుంచి అసహనం ఎదురుకాకుండా ముందుగానే కొన్ని చర్యలు ప్రారంభమయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి.

## అమర్ రాజా సంస్థకు ఫోర్బ్ జాబితా

తిరుపతి, జూలై 7, అమరరాజా బ్యాటరీస్ కంపెనీ ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకుంది. ఫోర్బ్స్ తాజాగా విడుదల చేసిన బెస్ట్ ఎంప్లాయిర్స్ జాబితాలో ఫోర్బ్స్ కంపెనీకి చోటు లభించింది. అమరరాజా బ్యాటరీస్ గుంటూరు ఎంపీ, తెలుగుదేశం నాయకుడు గల్లా జయదేవ్ కుటుంబానికి చెందిన కంపెనీ అన్న సంగతి విదితమే. ఫోర్బ్స్ విడుదల చేసిన టాప్ 500 బెస్ట్ ఎంప్లాయిర్స్ జాబితాలో తమ సంస్థ నిలిచిన విషయాన్ని అమరరాజా గ్రూప్ వెల్లడించింది.ఈ మేరకు చేసిన ట్వీట్ లో తమ సంస్థకు ప్రతిష్టాత్మక ఫోర్బ్స్ బెస్ట్ ఎంప్లాయర్ జాబితాలో స్థానం లభించడం పట్ల ఆనందం వ్యక్తం చేసింది. ప్రజల విశ్వాసం, నమ్మకం చూరగొన్నందు వల్లే తమ సంస్థకీ గుర్తింపు వచ్చిందని పేర్కొంది.ఫోర్బ్స్ సంస్థ జాబితాలో స్థానం పొందడం తమ సంస్థకు దక్కిన గౌరవంగా అభివర్ణించిన అమరరాజా గ్రూప్ ఈ స్ఫూర్తితో మరింత ఉత్తమంగా ముందుకు సాగుతామని ట్వీట్ లో పేర్కొంది. త్వరలో లడఖ్ లో దేశంలోనే తొలి గ్రీన్ హైడ్రోజన్ ఫ్యూయలింగ్ స్టేషన్ ను నెలకొల్పబోతున్నట్లు అమరరాజా గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ ఆ ట్వీట్లో తెలిపారు.

## జాతీయ రహదారులపై పార్కింగ్ స్థలం లేకపోతే మూతే

విజయవాడ జూలై 7, రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) కొత్త కార్యాచరణకు ఉపక్రమించింది. జాతీయ రహదారులను ఆనుకుని ఉండే దాబాలు, హోటళ్లకు విధిగా పార్కింగ్ స్థలాలు ఉండాలని స్పష్టం చేసింది. నిర్ణీత గడువులోగా తగినంత పార్కింగ్ ప్రదేశాలు లేని దాబాలు, హోటళ్లను తొలగించాలని కూడా నిర్ణయించింది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల వెంబడి రోడ్డు ప్రమాదాల తీరును ఎన్‌హెచ్ఏఐ విశ్లేషించింది. జాతీయ రహదారులపై ఓ పక్కకు నిలిపి ఉంచే వాహనాలను ఇతర వాహనాలు ఢీకొట్టడవే ఎక్కువ ప్రమాదాలకు కారణమని గుర్తించింది.జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దాబాలు, హోటళ్లకు సమీపంలోనే ఎక్కువగా వాహనాలను నిలిపి ఉంచుతున్నట్టు కూడా ఎన్‌హెచ్ఏఐ పరిశీలనలో వెల్లడైంది. దాంతో హైవేల వెంబడి ఉన్న దాబాలు, హోటళ్లకు తగినంత పార్కింగ్ ప్రదేశాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఎన్‌హెచ్ఏఐ ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాల్లోనూ హైవేల వెంబడి ఉన్న దాబాలు, హోటళ్లను గుర్తించి పార్కింగ్ ప్రదేశాలపై నివేదిక సమర్పించాలని కోరింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని హైవేలను ఆనుకుని ఉన్న దాబాలు, హోటళ్లపై ఎన్‌హెచ్ఏఐ అధికారులు చేపట్టిన సర్వే దాదాపు పూర్తి కావచ్చింది.రాష్ట్రంలో దాదాపు 40 శాతం దాబాలు, హోటళ్లకు పార్కింగ్ స్థలాలు లేవని సర్వేలో తేలినట్టు సమాచారం. ఆ దాబాలు, హోటళ్లకు త్వరలో నోటీసులు జారీ చేయనున్నారు. మూడు నెలల్లో పార్కింగ్ ప్రదేశాలు సమకూర్చుకోవాలని నిర్దేశించనున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని 7.50 మీటర్ల వరకు ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదు. అంటే రోడ్డుకు దాబా, హోటళ్లకు మధ్య కనీసం 7.50 మీటర్ల దూరం ఉండాలి. ఆ మధ్యలో పార్కింగ్ ప్రదేశాన్ని చూపించకూడదు.దాబాకు పక్కన పార్కింగ్ ప్రదేశాన్ని వేరేగా చూపించాలి. దాబాలు, హోటళ్ల వద్ద తగిన లైటింగ్ సదుపాయం తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. తెల్లవారుజామున మంచు కురుస్తున్నప్పుడు కూడా వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఫాగ్ లైట్లను ఏర్పాటు చేయాలి. తప్పనిసరిగా టాయిలెట్లు, స్నానాల గదులు ఉండాలి. ప్రతి దాబా, హోటల్‌లో ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందుబాటులో ఉండాలి. ఆ సమీపంలోని ఆస్పత్రులు, పోలీస్ స్టేషన్ల ఫోన్ నంబర్లు, ఇతర వివరాలతో బోర్డులు ఏర్పాటు చేయాలి. మూడు నెలల్లో పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయని దాబాలు, హోటళ్లను మూసివేయిస్తారు.



# వైసీపీలో అంతర్గత విభేదాలు

ఒంగోలు, జూలై 7, వైసీపీ ప్లీనరీ మరికొద్దిరోజులలో జరగనుంది. సంబరాలు చేసుకోవాల్సిన సమయం. మూడేళ్ల వైఎస్ జగన్ పాలన ముగిసిన సందర్భం. కానీ వైసీపీలో అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయి. ఒకరితో ఒకరికి పడటం లేదు. గ్రూపులు ముదిరాయి. నేతలు రోడ్డుకెక్కుతున్నారు. అధికార పార్టీలో ఇది సర్వసాధారణమయినా బహిరంగంగా వీధికెక్కడంతో ప్రజల్లో పలుచన అవ్వడం ఖాయంగా కన్పిస్తుంది. ఎమ్మెల్యేలపై వ్యతిరేకత ముదురుతుంది. దానిని కప్పి పుచ్చుకునేందుకు కొందరు కుట్ర కోణం అంటూ గగ్గోలు పెడుతున్నారన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఎమ్మెల్యే సక్రమంగా ఉంటే.. ఎమ్మెల్యే సమర్థుడయితే.. అందరివాడుగా నడుచుకుంటే ఎందుకు గ్రూపులుంటాయి? కానీ ఎక్కువ మంది ఎమ్మెల్యేలు తాము ఎన్నికైన తర్వాత కష్టపడిన నేతలను వదిలేశారు. కొత్తవారిని కౌగిలించుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో పక్కన ఉన్న వారు ఇప్పు?డు ఎవరూ కనపడటం లేదు. అన్నీ కొత్త ముఖాలే. వారికే పదవులు. పనులు. దీంతో 2019 ఎన్నికల్లో కష్టపడి పార్టీ కోసం ఒళ్లూ, నోట్లూ గుల్ల చేసుకున్న వారికి మాత్రం ప్రాధాన్యత లభించడం లేదు. ఎమ్మెల్యేలు ఇంత గింజుకోవడం ఎందుకు? తాము చేసిన తప్పులు వారికి గుర్తుకురావడం లేదు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇలా ప్రముఖులే తమపై కుట్ర జరుగుతుందని ఆరోపిస్తున్నారు. సొంత పార్టీ నేతలే తమను వెన్నుపోటు పొడుస్తున్నారంటున్నారు. దాదాపు ఎమ్మెల్యేల్లో 60 శాతం మంది ఇదే రకమైన ఆరోపణలు చేస్తున్నారు. ఇతర పార్టీల నుంచి నేతలు వైసీపీలో చేరిన చోట అయితే అర్థం చేసుకోవచ్చు. కానీ తొలి నుంచి ఉన్న నేతలను ఎమ్మెల్యేలు కాదనుకుంటున్నారంటే ఎవరి తప్పిదమన్న ప్రశ్న తలెత్తుతోంది. నిజానికి ఎమ్మెల్యేలు ద్వితీయ శ్రేణి నేతలను మాత్రమే కాదు, కార్యకర్తలను కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. పూర్తిగా పక్కన పెట్టేశారు. గతకొద్దిరోజుల నుంచి గడప గడప కు ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వారిని స్వయంగా ఆహ్వానిస్తున్నా చాలా చోట్ల అసలైన క్యాడర్ ముఖం చాటేస్తుంది. రేపు ఎన్నికల నాటికి నిజమైన వైసీపీ నేతలు, క్యాడర్ దూరం జరిగితే నష్టపోయేది వీరే. ఇప్పటికైనా కుట్రలని గొంతు చించుకుండా తమ తప్పులను ఎమ్మెల్యేలను సరిదిద్దుకుంటే మేలన్న సూచనలు విన్పిస్తున్నాయి.

# జిల్లాకు ఏడు స్థానాలపై గురి

ఏలూరు, జూలై 7, ఏపీలో పవన్ కల్యాణ్ దూకుడు పెంచనున్నారు?ఇప్పటివరకు అప్పుడప్పుడు మాత్రమే పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పోరాటం చేసిన పవన్?ఇకపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టి రాజకీయం చేయనున్నారు. ఇప్పటికే పార్టీ బలోపేతంపై పవన్ దూకుడు పెంచారు..పొత్తుల సంగతి ఎన్నికల ముందు చూసుకుందామని తేల్చి చెప్పేసిన పవన్?ఇప్పుడు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఫోకస్ పెట్టారు.అలాగే పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాలపై ఇంకా ఎక్కువ పెట్టి పనిచేసేలా జనసేన నేతలకు దిశానిరేశం చేశారు..దీంతో పార్టీ బలంగా ఉన్న స్థానాలని వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో పవన్ పనిచేస్తున్నారు. ఈ క్రమంలోనే పార్టీ స్ట్రాంగ్ గా ఉన్న ఉమ్మడి తూర్పు గోదావరిపై పవన్ ఎక్కువ ఫోకస్ పెట్టారు. గత ఎన్నికల్లో జిల్లాలో జనసేనకు ఓట్లు బాగానే పడ్డాయి?దాదాపు ఒక్కో నియోజకవర్గంలో 25 వేల పైనే ఓట్లు పడ్డాయి. ఏదో నాలుగైదు స్థానాలు మినహా మిగిలిన చోట్ల 25 వేల పైనే ఓట్లు వచ్చాయి.ఇక అలాంటి స్థానాలనే జనసేన టార్గెట్ పెట్టుకుని, ఆ స్థానాల్లో గెలవాలని చూస్తుంది. రాజోలు సీటు ఎలాగో గత ఎన్నికల్లో జనసేన ఖాతాలో పడింది..కానీ అక్కడ గెలిచిన రాపాక వరప్రసాద్?తర్వాత వైసీపీలోకి వెళ్లారు. అయినా సరే రాజోలులో జనసేన బలం తగ్గలేదు..నెక్స్ట్ ఈ సీటు ఎలాగైనా కైవసం చేసుకోవాలని జనసేన చూస్తుంది. అలాగే అమలాపురం, ముమ్మిడివరం, పి.గన్నవరం, ప్రత్తిపాడు, కాకినాడ సిటీ, రూరల్, పిఠాపురం లాంటి స్థానాల్లో జనసేనకు ఓట్లు బాగా పడ్డాయి. ముఖ్యంగా అమలాపురం, ముమ్మిడివరం సీట్లలో జనసేనకు బాగా పట్టు ఉంది. ఇక రెండు సీట్లని సైతం కైవసం చేసుకోవాలని పవన్ చూస్తున్నారు. అటు కాకినాడలో కనీసం ఏదొక సీటుని దక్కించుకోవాలని అనుకుంటున్నారు. అయితే టీడీపీతో పొత్తు ఉంటే కనీసం..జిల్లాలో 7-8 సీట్లు తీసుకుని గెలవాలని పవన్ భావిస్తున్నారు. మరి చూడాలి తూర్పులో జనసేన సత్తా చాటుతుందో లేదో.

# కుప్పంలో మారుతున్న సమీకరణాలు

తిరుపతి, జూలై 7, (న్యూస్ పల్స్)వైసీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి కుప్పం టార్గెట్ గా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయం నడుపుతున్న విషయం తెలిసిందే?చంద్రబాబు అడ్డాగా ఉన్న కుప్పంలో వైసీపీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పెద్దిరెడ్డి పావులు కదుపుతున్నారు. మామూలుగా కుప్పంలో చంద్రబాబుకు తిరుగులేదనే సంగతి తెలిసిందే. 1989 నుంచి 2019 వరకు వరుసగా ఏడు సార్లు చంద్రబాబు కుప్పంలో గెలిచారు. అయితే ఈ సారి చంద్రబాబుకు ఛాన్స్ ఇవ్వకూడదని వైసీపీ భావిస్తుంది.అందుకే మంత్రి పెద్దిరెడ్డి మొదట నుంచి కుప్పంపైనే టార్గెట్ పెట్టారు. అక్కడ టీడీపీని వీక్ చేయడమే లక్ష్యంగా ముందుకెళుతున్నారు. ఈ క్రమంలోనే పంచాయితీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీని చిత్తు చేసి వైసీపీని గెలిపించారు. అయితే చంద్రబాబు సాధారణ ఎన్నికల్లోనే కుప్పం ప్రచారానికి వెళ్లరు..కానీ కుప్పం మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారానికి బాబు వచ్చారు. బాబు వచ్చిన సరే కుప్పం మున్సిపాలిటీ వైసీపీ ఖాతాలోనే పడింది.ఇక ఇక్కడ నుంచి బాబు కుప్పంపై ఎక్కువ ఫోకస్ పెట్టారు. కనీసం నెలకొకసారైన కుప్పం వస్తున్నారు. అలాగే అక్కడ పర్మినెంట్ గా ఇల్లు కూడా కట్టుకుంటున్నారు. ఇదంతా పెద్దిరెడ్డి ఎఫెక్ట్ అనే చెప్పాలి. అయితే బాబు అలెర్ట్ అయ్యే కొద్దీ, పెద్దిరెడ్డి ఇంకా దూకుడు పెంచుతున్నారు. ఇప్పటికే కుప్పంలో చంద్రబాబుపై పోటీ చేసే అభ్యర్థిని ప్రకటించేశారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలో వైసీపీ తరుపున ఎమ్మెల్సీ భరత్ పోటీ చేస్తారని చెప్పేశారు. ఇక అభ్యర్థిని ప్రకటించిన దగ్గర నుంచి కుప్పంలో టీడీపీ శ్రేణులని వైసీపీలోకి లాగే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలువురు టీడీపీ కార్యకర్తలు వైసీపీలోకి వచ్చారు. తాజాగా మరికొందరు వైసీపీలో చేరారు.అయితే ఇలా రోజురోజుకూ టీడీపీ కార్యకర్తలు జంప్ అయిపోతుండటంతో?ఇంకా కుప్పం సీటుని బాబు వదులుకుంటారేమో అని ప్రచారం నడుస్తోంది?ఇప్పటికే వైసీపీ నేతలు?బాబు, కుప్పం వదిలి పారిపోతారని అంటున్నారు. కానీ బాబు కుప్పం వదిలే ప్రసక్తి లేదని, ఎనిమిదో సారి కూడా అక్కడ గెలిచి సత్తా చాటుతారని టీడీపీ శ్రేణులు అంటున్నాయి. మరి చూడాలి ఈ సారి కుప్పంలో బాబు పరిస్తితి ఎలా ఉంటుందో




# చట్టాన్ని మీ చేతుల్లో తీసుకో కూడదు సీఐ



**ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలి...**
**ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి**
**నిబంధనలు పాటించి పండుగ జరుపుకుందాం**
**దూద్ బాష**
**బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన సీఐ, ఎస్ ఐ**

కౌతాళం జూలై 10 తరికున నిర్వహించుకునే బక్రీద్ పండుగను మండలంలోని ముస్లిం సోదరులందరూ ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలని సీఐ మహేశ్వర్ రెడ్డి ఎస్ ఐ నరేంద్ర కుమార్ రెడ్డి తెలియజేశారు.గురువారం రోజున మండల కేంద్రమైన కౌతాళం లోని స్థానిక పోలీస్ స్టేషన్ నందు బక్రీద్ పండుగ నిర్వహణపై అధికారులు ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో భాగంగా పోలీస్ అధికారులు నిబంధనలను పాటిస్తూ ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలియజేశారు.పండుగ రోజు నిర్వహించే ప్రార్థన సమయాలలో మాస్కులు ధరించి,భౌతిక దూరాలను పాటిస్తూ బక్రీద్ పండుగను జరుపుకోవాలని తెలియజేశారు. పండుగ రోజు ఎటువంటి అల్లర్లు సృష్టించకుండా ప్రజలు ప్రశాంతంగా బక్రీద్ పండుగను జరుపుకోవాలని అధికారులు ముస్లిం మత పెద్దలకు,ప్రజలకు తెలియజేశారు.అనంతరం మారుతి మోహన్ ఎస్ ఐ సీఐ అద్వాన్స్ ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ



కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉప ఎంపిపి బుజ్జి స్వామి, మారుతి మోహన్, బాపురం శెట్టి, రామన్న గౌడ్, దూద్ బాష, ఖాజా,,ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# 11 నుంచి సమ్మెలోకికార్మికులు గోడపత్రాలు ఆవిష్కరణ

**ఏఐటీయూసీ,సిఐటీయు**

కడప న్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జులై 11 నుంచి సమ్మె చేపడతామని నోటీసు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగానే సమ్మె చేపట్టాల్సిన ఆవశ్యకత ఏర్పడినదని ఏఐటీయూసీ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి లు ఎల్. నాగసుబ్బారెడ్డి,బి.మనోహర్ తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు చెల్లించాల్సినటువంటి 6నెలలు హెల్త్ అలవెన్సులు విడుదలపై నోరు మెదపడం లేదని, పర్మినెంట్ కార్మికులకు సంబంధించి సరెండర్ లీవుల ఎంక్యాష్మేంట్ గడువు దాటిన ప్రభుత్వం సంబంధం లేనట్లు చూస్తున్నదని, రాష్ట్రంలో పనిముట్ల కొరత కార్మికులకు తీవ్రంగా ఉందని, కోవిడ్ విపత్తులో పనిచేస్తూ మరణించిన కార్మికుల కుటుంబాలకు 50 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లింపులో తీవ్రమైన వివక్షత చూపిస్తున్న ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ, పని ఒత్తిడిని పెంచే సచివాలయాలకు కార్మికులు బదలాయింపు ఆపాలని, జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, అప్కస్ రద్దు చేసి ఒప్పంద కార్మికులను క్రమబద్ధీకరించాలని, మరణించినా రిటైర్మెంట్ అయిన కార్మికుల స్థానంలో వారి పిల్లలకు పనులు కల్పించాలని, పర్మినెంట్ కార్మికుల సంబంధించి జీపీఎఫ్ ఖాతాలు తెరవాలని, పండుగ, జాతీయ సెలవు దినాలు వర్తింపజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జీ.వేణుగోపాల్,డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసి.బాదుల్లా, జిల్లా సమితి సభ్యులు పి.చంద్రశేఖర్, మునిసిప ల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూ సీ నగర కార్యదర్శి తారక రామా రావు, నాయకులు చెన్నయ్య, సీఐటీయు మునిసిపల్ యూనియన్ నాయకులు గోపి లు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మార్పీఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవం

పత్తికొండ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 1994 జూలై 07 ప్రకాశం జిల్లా ఈదుముడి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ స్థాపించారు. నేటికి 27సంవత్సరాలు పూర్తి చేసుకుని 28 సంవత్సరం లోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా పత్తికొండ పట్టణం ఎస్సీ కాలనిలో గురువారం ఉదయం 10 గంటలకు మాదిగల ఆత్మ గౌరవ ఎమ్మార్పీయస్ జెండాను మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు సుభాష్ చంద్ర మాదిగ ఎగురవేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎస్సీలలో ని 59 కులాలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, వైద్య, ఆర్థికరాజకీయంగా ఎదగాలంటే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ జరగాలని 27 సంవత్సరాల నుంచి మాదిగ, మాదిగ ఉపకులాలు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కొరకు అలుపెరుగని పోరాటం కొనసాగుతుంది. అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేస్తామని చెప్పి మాదిగల ఓట్లు వేయించుకుని అధికారం లోకి వచ్చిన తర్వాత వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తున్నారు. మాదిగలు రాబోయే రోజుల్లో ఓటుతోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. యువకులు, విద్యార్థులు, ఎమ్మార్పీఎస్ ఉద్యమ పోరాటంలో భాగస్వాములు ఎస్సి వర్గీకరణ సాధించుకునే దిశగా ఉద్యమంలోపాల్గొనాలని వారు పిలునిచ్చారు. అదేవిధంగా కర్నూలు జిల్లాలోని గ్రామల వారిగ మండలాలు, జిల్లాలోని అన్ని చోట్లా ఎమ్మార్పీయస్ జెండాలను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి వ్యవస్థాపక అధ్యక్షులు బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాన్య శ్రీ మంద కృష్ణ మాదిగ 58వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ మాదిగల ఆవిర్భావ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మరియు ఎంఎస్పి రవికుమార్ మాదిగ, రాముడు మాదిగ,తిరుపాల్ మాదిగ, టాగూర్ మాదిగ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విలీనానికి ఒప్పుకోం. చిన్నపిల్లలు ఒక కిలోమీటర్ నడిచి వెళ్లలేరు



**విద్యార్థులతో తల్లిదండ్రుల ధర్నా**

మంత్రాలయం ఎలిమెంటరీ పాఠశాలలో మూడు నాలుగు ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థులను ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న పాఠశాలకు పంపడానికి మేము అంగీకరించమని సూగూరు గ్రామంలో పాత సూగూరిలో తల్లిదండ్రులు పాఠశాల ముందు విద్యార్థులతో సహా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన సంఘటన సూగూరు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. మెయిన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీచర్లు ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న పాత ఊరిలో ఎలిమెంటరీ పాఠశాలలోని మూడు నాలుగు ఐదు తరగతి విద్యార్థులను మెయిన్ పాఠశాలకు పంపించాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తెలిపారు. ఆ పాఠశాల ఉపాధ్యాయులు మూడు నాలుగు ఐదు తరగతుల విద్యార్థులను ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న పాఠశాలకు పంపడానికి సమయత్తం అయ్యారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులతో మేము ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న పాఠశాలకు మా పిల్లలను పంపించమని చిన్న పిల్లలు అంత దూరం నడవలేరని అన్నారు. అలాగే పాత ఊరి నుంచి ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న మెయిన్ పాఠశాలకు పిల్లలు మెయిన్ రోడ్డుపై ఎలా నడుచుకుంటూ వెల్తారని, అంత దూరం చిన్న పిల్లలు నడవలేరని అలాగే రోడ్డుపై ఎక్కువగా వాహనాలు తిరుగుతున్నాయని వచ్చేటప్పుడు పోయేటప్పుడం పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని ఉపాధ్యాయులను ప్రశ్నించారు .ఉపాధ్యాయులు ఇందులో మా ప్రమేయం ఏమీ లేదని ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు రాతపూర్వకంగా పాఠశాల విలీనానికి అంగీకరించమని విద్యార్థులు తల్లిదండ్రులు సంతకాలు చేసి ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఆ వినతి పత్రాన్ని ఎంఈఓ కు పంపిస్తామని ప్రధానోపాధ్యాయులు తెలిపారు . విద్యార్థులు తల్లిదండ్రులతో పాటు గ్రామ నాయకులు కూడా పాత ఊరిలో ఉన్న మూడు నాలుగు ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థులను ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న పాఠశాలకు పంపించడానికి అంగీకరించమని పేర్కొన్నారు. ఏ పాఠశాల పిల్లలు ఆ పాఠశాలలోనే చదివితే బాగుంటుంది అని వారు తెలిపారు. మూడు నాలుగు ఐదు తరగతులు చదువుతున్న 150 మంది విద్యార్థులు మెయిన్ పాఠశాలకు వెళితే అక్కడ ప్రస్తుతం 135 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం కలిపితే 285 మందికి పైగా విద్యార్థులు అవుతారు. మళ్ళీ 285 మంది విద్యార్థులకు గదులు సరిపోవడం లేదు. గదుల కొరత కూడా ఉంది గదుల కొరత పరిష్కరించకుండా పాఠశాల విలీనాం ఎలా చేస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా గదుల కొరతతో సతమతమవుతున్నామని ఇప్పటికే పిల్లలను చెట్ల కింద ,వరండాలో కూర్చోబెట్టి చదువులు చెబుతున్నామని ఇప్పుడు ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులు 150 మంది మా పాఠశాలకు వస్తే పిల్లల్ని ఎక్కడ కూర్చోబెట్టి చదువులు చెప్పాలో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిజం చెప్పాలంటే సూగూరు లో ఉన్న ఉన్నత పాఠశాలకు గదులే లేవు .ఒక్క గది కూడా లేదు .ఎలిమెంట్ స్కూల్లో ఉన్న గదులను వీరు వాడుకుంటున్నారు. ఉన్నత పాఠశాల ప్రారంభమై ఐదు సంవత్సరాలైనా ఒక్క గది కూడా కేటాయించకపోవడం పాఠశాల కేటాయించకపోవడం ప్రభుత్వ అధికారుల నాయకుల నిర్లక్ష్యానికి దర్పనంగా నిలుస్తోంది. ప్రస్తుతం కొత్త సూగూరులో ఏడు గదులకు గాను మెయిన్ పాఠశాలకు ఐదు తరగతులకు గాను మూడు గదులు,ఇంకా మూడు గదులు ఉన్నత పాఠశాలకు ఇంకా ఒక గది అంగన్వాడి సెంటర్ నిర్వహిస్తున్నారు.

# దళితుల ఆందోళన

విశాఖపట్నం ఎస్సి, ఎస్టిలకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని కొనసాగించాలని కోరుతూ విశాఖలో దళిత హక్కుల సంక్షేమ సంఘం ధర్నాకు దిగింది. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దళిత హక్కుల సంక్షేమ సంఘం సభ్యులు ధర్నా చేపట్టారు.దళితుల ఓట్లతో గెలిచిన జగన్మోహన్రెడ్డి వారికే అన్యాయం చేస్తున్నారని ఆరోపిం చారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకాన్ని రద్దు చేయడం వల్ల రాష్ట్రంలో 38 వేల మంది విద్యార్థులు నష్టపోతారన్నారు. ఈ ప్రతిపాదన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా ఆయా పాఠశాల యాజమాన్యం కోర్ట్ తీర్పుకు గౌరవించడం లేదని ఫీజులు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# రేణిగుంట ఆర్డీయే చెక్ పోస్టు లో ఏసీబీ తనిఖీలు

తిరుపతి రేణిగుంట ఆర్టీఏ చెక్ పోస్ట్ లో తిరుపతి ఏసీబీ డిఎస్పీ జనార్ధన నాయుడు అధ్వర్యంలో అదికారులు సోదాలు నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన పిర్యాదుల మేరకు తనిఖీలు నిర్వహించారు. చెక్ పోస్ట్ వద్ద వాహనదారుల నుంచి ప్రైవేట్ వ్యక్తుల ద్వారా అక్రమంగా నగదు వసూలును గుర్తించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్ తోపాటు ప్రైవేట్ వ్యక్తులు నారాయణ స్వామి, దొరబాబు ను అదుపులోకి తీసుకొని విచారించారు. అనధికారికంగా ఉన్న 1,50780 రూ లక్ష యాబై వేల ఏడువందల ఎనభై రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. డి ఎస్ పి జనార్ధన్ నాయుడు,సి ఐ లు తమీం అహ్మద్,ప్రతాప్ రెడ్డి,నాగేంద్ర, ఈశ్వర్,సునీల్,ఎల్ వి నాయుడు మరియు సిబ్బంది పాల్గొన్నారు...

# సముద్రంలో గల్లంతయిన కృష్ణాజిల్లా మత్స్యకారుల సురక్షితం

**కృష్ణాజిల్లా కలెక్టర్ సమాచారం అందించిన అధికారులు**

మచిలీపట్నం చేపల వేటకు వెళ్లి కనిపించకుండా పోయిన కృష్ణా జిల్లా మత్స్యకారుల ఆచూకీ దొరికింది. అందరూ క్షేమంగా ఉన్నట్లు ఫోన్ ద్వారా బంధువులకు సమాచారం ఇచ్చారు. వారంతా డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సమీపంలోని కొత్తపాలెం తీరానికి సురక్షితంగా చేరుకున్నారు.ఇదిలా ఉంటే ఈ నెల ఒకటో తేదీన మచిలీపట్నం మండలం క్యాంబెల్ పేటకు చెందిన పలువురు మత్స్యకారులు నాలుగు బోట్లలో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వారంతా తూర్పు గోదావరి జిల్లా అంతర్వేది తీర ప్రాంతంలో ఉండగా ఓ బోటు ఇంజిన్లో సాంకేతిక సమస్య తలెత్తి, కదలక మొరాయించింది. బోటులో సాధారణ కీప్యాడ్ ఫోను మాత్రమే ఉంది.ఆ ఫోను చార్జింగ్ అయిపోవడంతో బోటులోని మత్స్యకారులకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అప్పటి నుంచి మత్స్యకారుల ఆచూకీ లభ్యంకాక పోవటంతో ప్రభుత్వం గాలింపు చర్యలు చేపట్టారు. రెండు హెలికాప్టర్లతో ప్రత్యేక బృందాలు కాకినాడ సముద్ర పరిసర ప్రాంతాల్లో మంగళవారం నుంచి రేయంబవళ్లు గాలించాయి. మచిలీపట్నం నుంచి ప్రత్యేకంగా బోట్లను రప్పించి గాలింపు చర్యలు చేపట్టిన సంగతి తెలిసిందే.

# మన్రో సేవలు మరువలేనివి

**బిషప్ కె శామ్యూల్ బాబు**

కడప సర్ థామస్ మన్రో సేవలు మరువలేనివని కడప ప్రజలకు ఆయన ఎంతో సేవ చేశారని వరల్డ్ పీస్ అంబాసిడర్ కె శ్యామ్యూల్ బాబు అన్నారు గురువారం మన్రో వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు రాయలసీమ రైతాంగాన్ని ఆదుకునేందుకు అనేక సంస్కరణలు అమలు చేశారని చెప్పారు కడప జిల్లా మొదటి కలెక్టర్ గా మన్రో సేవలందించి ప్రజలు హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు కడప జిల్లా లోనే కాకుండా రాయలసీమలో ని అనేక ప్రాచీన కట్టడాలను సంరక్షించి వారసత్వ సంపదను కాపాడారని చెప్పారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మల్లెం విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

# వైవీయూ ఉర్దూ శాఖ రెగ్యులర్ పోస్టుల మంజూరుకు వినతి

**మంత్రి ని కలిసిన వైవీయూ ఆచార్యులు**

కడప యోగివేమన విశ్వవిద్యాలయం ఉర్దూ డిపార్ట్మెంట్ కు మౌలిక సదుపాయాలతో కూడిన టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల మంజూరు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి. అంజాత్ బాషా ను వైవీయూ ఉర్దూ విభాగాధిపతి ఆచార్య పి.ఎస్.షావల్లీఖాన్, హ్యూమానిటీస్ డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్ రెడ్డి కలిసి అభ్యర్థించారు.వైవీయూ లో ఉర్దూ పీజీ విద్యార్థుల బోధనకు సంబంధించి ప్రొఫెసర్.1, అసోసియేట్ ప్రొఫెసర్లు:2, ,అసిస్టెంట్ ప్రొఫెసర్లు: 4 పోస్టులు అలానే జూనియర్ అసిస్టెంట్, అటెండర్ పోస్టులు మంజూరు చేయాలని కోరారు. మౌలిక సదుపాయాల కోసం రూ.10 లక్షలు, డిపార్ట్మెంటల్ లైబ్రరీకీ రూ. 5 లక్షలు, లాంగ్వేజ్ ల్యాబ్ (ఉర్దూ) కు రూ.40 లక్షల ఆర్థిక సహాయం మంజూరయ్యేలా చూడాలని కోరారు. విశ్వవిద్యాలయం కులసచివులు ఆచార్య డి. విజయరాఘవ ప్రసాద్ ఇప్పటికే ఉన్నత విద్యా శాఖ కు వీటికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించారని మంత్రి దృష్టికి తెచ్చారు.ఎంఏ ఉర్దూ కోర్సులో అడ్మిషన్లు పూర్తి స్థాయిలో ఉన్నాయని అయితే రెగ్యులర్ అధ్యాపకులు ఒక్కరుకూడా లేరని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు పిహెచ్డి ప్రవేశాలను కోల్పోతున్నారని వివరించారు. మంత్రి అంజాద్ బాష స్పందించి మాట్లాడుతూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో వైవీయూ ఉర్దూ బీవోఎస్ మెంబర్ ఎస్. సుభాన్ బాష, అధ్యాపకులు డా. షేక్ ఖాజాపీర్, సర్దార్ ఖాజామొయినుద్దీన్, సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు డా.సయ్యద్ అంజాద్ అలీ, రూటా అధ్యక్షులు సయ్యద్ హిదయతుల్లా, ఆర్ట్స్ కళాశాల ఉర్దూ విభాగాధిపతి డా.సయ్యద్ వసీవుల్లా భక్తియారి, అయూబ్ , అన్వర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలి




**ఐద్వా,ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, రజక వృత్తిదారుల సంఘం. కెవిపిఎస్ డిమాండ్**

కర్నూలు జూలై 07 కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా, రజక వృత్తిదారుల సంఘం కెవిపిఎస్,డివైఎఫ్ ఐ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు వినూత్నంగా గ్యాస్ బండకు పూజ చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ కర్నూల్ సిటీ అధ్యక్షుడు సాయి ఉదయ్ అధ్యక్షత వహించడం జరిగింది ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్. మాట్లాడారు.కేంద్ర ప్రభుత్వం నెలలోపే రెండు సార్లు గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారాలు వేయడం దుర్మార్గం అన్నారు. ఇప్పటికే పెట్రోల్ డీజిల్ నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రజల జీవన ప్రమాణాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పెంచిన ధరలను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం నేర్పుతారని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు. ఏపీ రజక వృత్తిదారుల సంఘం కర్నూల్ న్యూ సిటీ అధ్యక్షుడు రాముడు. కార్యదర్శి శేషాద్రి. ఓల్డ్ సిటీ అధ్యక్షురాలు జయమ్మ. నగర నాయకురాలు సుగుణ. ఈశ్వరమ్మ. చందు. డివైఎఫ్ఐ న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్,ఐద్వా నాయకురాళ్లు కిరణ్మయి, చిట్టీ, పిఎస్. సుజాత. పర్వీన్. సావిత్రి. కుమారి. కెవిపిఎస్ మహిళా నాయకురాలు విజయమ్మ. కెవిపిఎస్ జిల్లా నాయకులు గురుస్వామి. ఎస్ఎఫ్ఐ నగర నాయకులు నరసింహ. భాస్కర్. కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో జర్నలిస్టులకు రాయితీ ఇవ్వాలి



**- కలెక్టర్ కు విన్నవించిన ఏపీయూడబ్ల్యూజే నేతలు**
**- డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానన్న కలెక్టర్**

కర్నూలు జూలై 07 -: ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదుతో చికిత్స చేయించుకునే జర్నలిస్టులకు మొత్తం ఫీజులు 40 శాతం రాయితీ ఇవ్వాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా హడ హక్ కమిటీ కన్వీనర్ ఈ.ఎన్.రాజు, సభ్యులు కొండప్ప, కృష్ణా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ కోరారు. గురువారం జర్నలిస్టుల సమస్యల పై జిల్లా కలెక్టర్ కోటేశ్వర రావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాజ్యాంగంలో నాలుగవ స్తంభంగా మీడియా ఉ ందన్నారు. అయితే మీడియా లో పని చేసే జర్నలిస్టుల పరిస్థితి అంతంత మాత్రమే ఉందన్నారు. చాలీ చాలని వేతనాలతో దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నారని అన్నారు. అనారోగ్యం పాలైతే.. చూపించుకునే ఆర్థిక స్థోమత కూడా కరువైందని అన్నారు. కనుక జర్నలిస్టుల ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లో జర్నలిస్టు పిల్లలకు మొత్తం ఫీజులో 60 శాతం రాయితీ ఇప్పించాలని కోరారు. అలాగే ప్రైవేట్ కార్పోరేట్ లో నగదుతో వైద్యం చేయించుకునే జర్నలిస్టు కుటుంబ సభ్యులకు మొత్తం బిల్లు లో 40 శాతం రాయితీ ఇప్పించాలని కోరారు. అలాగే కర్నూల్ నగరంలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కలెక్టర్ ను కోరారు. దీనిపై కలెక్టర్ కూడా సానుకూలంగా స్పందించారు. మొదట జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ లోనూ, ఆసుపత్రుల్లో నూ రాయితీ విషయమై మాట్లాడుతానని చెప్పారు. ఇళ్ళ పట్టాల విషయం కూడా పరిశీలిస్తామని చెప్పారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే సీనియర్ నాయకులు కొండా శీను, దస్తగిరి, సామ్నా నాయకులు కుమార్, అంజి, అవినాష్, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

# కర్నూలు జిల్లా మతసామరస్యంలో ఆదర్శంగా, స్ఫూర్తిగా ఉండాలి




**-: జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్**
**మత పెద్దలతో శాంతియుత సమావేశం నిర్వహించిన ... జిల్లా ఎస్పీ.**
**కలిసి మెలిసి పండుగలు జరుపుకోవాలి**
**సోషల్ మీడియా లో వచ్చే వదంతులు నమ్మవద్దు, షేర్ చేయవద్దు**
**సంప్రదాయాలను గౌరవించాలి**
**ఇతరుల మనో భావాలకు భంగం కలిగించరాదు**
**సోషల్ మీడియాలో వదంతులను ఉద్దేశ్యపూర్వకంగా ఎవరైనా చేస్తే ఉపేక్షించేది లేదు**
**ఏమైనా సమస్యలు, ఫుకార్లు , వదంతులు వస్తే మొదటగా పోలీస్ కంట్రోల్ రూమ్ వాట్సాప్ నెంబర్ కు 7777877722 సమాచారం ఇస్తే నిజ నిర్ధారణ చేసి చర్యలు తీసుకుంటాం**
**జిల్లాలో 24 గంటలు పోలీసులు అందుబాటులో ఉంటారు**
**ఏ సంఘటన జరిగినా పోలీసుల దృష్టికి తీసుకు రండి**

కర్నూలు జూలై 07 -:ఈ నెల 10 న బక్రీద్ పండుగ సంధర్బంగా కర్నూలు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో శాంతి (పీస్ కమిటి) కమిటి సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో నగరంలోని వివిధ వర్గాలకు చెందిన సామాజిక మత పెద్దలు, జిల్లా స్ధాయి అధికారులతో జిల్లా ఎస్పీ మాట్లాడారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ మాట్లాడుతా కర్నూలు జిల్లా మతసామరస్యంలో ఆదర్శంగా, స్ఫూర్తిగా ఉ ండాలన్నారు. కలిసి మెలిసి పండుగలు చేసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు, వదంతులు వస్తే పోలీసు కంట్రోల్ రూమ్ వాట్సప్ నెంబర్ 7777877722 కి గాని, స్ధానిక పోలీసులకు గాని తెలియజేయాలన్నారు. నిజ నిర్ధారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. పారదర్శకంగా పని చేస్తామన్నారు. నైతిక బాధ్యతతో ఉండాలన్నారు. ఎవరైనా సమస్యతో వస్తే వందశాతం న్యాయం చేస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పకడ్భందీగా ఏర్పాట్లు చేస్తామన్నారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.పుకార్లు, వదంతలను ప్రచారం చేయకూడదన్నారు, నమ్మవద్దన్నారు. సోషల్ మీడియా, వాట్సప్ గ్రూప్ ల పై జిల్లా పోలీసులు నిఘా ఉంచారన్నారు.సోషల్ మిడియాలో వదంతులను ఉద్దేశ్యపూర్వకంగా ఎవరైనా చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. 24 గంటలు పోలీసులు అందుబాటులో ఉంటారన్నారు. ఒకరిని ఒకరు గౌరవించుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతను పటిష్టం చేస్తామన్నారు. కర్నూలు నగర మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ్ మాట్లాడుతూఅందరూ ఐక్యమత్యంతో మంచి భావనతో ఉండడం సంతోషకరమన్నారు. మన ప్రాంతం, మనం అందరం బాగుండాలన్నారు. మనోభావాలను గౌరవించుకుంటూ సంతోషంగా ఉ ండాలన్నారు. వదంతులు వస్తే వ్యాప్తి చేయకుండా కొద్దిగా ఆలోచించి పై అధికారులకు తెలియజేయాలన్నారు. మున్సిపల్ శాఖ తరపున అన్ని సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ప్రసాద్, నాగబాబు, డిఎస్పీలు వెంకటాద్రి, కెవి మహేష్, సిఐలు, మత పెద్దలు సోమిశెట్టి వెంకటరామయ్య, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ అబ్దుల్ సలాం, మౌలానా అబ్దుల్ ఖదీర్, ప్రతాపరెడ్డి , వీరు ప్రతాపరెడ్డి, హరీష్ బాబు, భాను ప్రకాష్, రాముడు, సందడి సుధాకర్, పర్వేజ్, జహంగీర్ అహ్మద్, యూనిస్ భాష, మన్సూర్ భాష పాల్గొన్నారు.

## ఈ ప్రభుత్వ ఎయిడెడ్ స్కూళ్లను 3,4,5, తరగతులను విలీనం సరికాదు :-టి ఎన్ ఎస్ ఎఫ్ రామాంజనేయులు,



కర్నూలు జూలై 07 -: గురువారం కర్నూలులో జరిగిన విలేకరుల సమావేశంలో కర్నూలు టి ఎన్ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు కర్నూలు నియోజకవర్గ అధ్యక్షులు రాజ కుమార్ కోడుమూరు నియోజకవర్గ అధ్యక్షులు బొగ్గుల భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడు నాలుగు ఐదు తరగతులను విలీనం చేస్తూ వచ్చిన జీవో 117 రద్దు చేయాలని అశాస్త్రీయంగా జరుగుతున్న విలీన ప్రక్రియ రద్దు చేసి విద్యార్థుల విద్యను దూరంగా కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రకంగా విలీనం చేయడం వల్ల విద్యార్థుల డ్రాపోర్టు పెరుగుతుందని అంతేకాకుండా గ్రామీణ ప్రాంతం లో హై స్కూల్ కి వెళ్లాలంటే దాదాపుగా కిలోమీటర్ దూరం ప్రధానమైన రోడ్డు మార్గాల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఈ మార్గాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉన్నది మూడవ తరగతి చదువుతున్న విద్యార్థులు పోవడానికి రావడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతాయని, కనుక విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ విలీన ప్రక్రియ ను రద్దు చేయాలని వరు తెలిపారు ఒకవేళ ఆ విధంగా కొనసాగించకపోతే రాబోయే రోజుల్లో విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులను కలుపుకొని టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని విద్యార్థి నాయకులు తెలిపారు

# కల్యాణ్ రామ్ కాన్ఫిడెన్స్ వెనకున్న మాస్టర్ ప్లాన్ ఏంటీ?




నందమూరి కల్యాణ్ రామ్ సినిమా థియేటర్లలో సందడి చేసి దాదాపు రెండేళ్లవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన నుంచి వస్తున్న ఫాంటసీ యాక్షన్ మూవీ 'బింబిసార'. ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్ పై నందమూరి కల్యాణ్ రామ్ నటిస్తూ ఈ భారీ మూవీని నిర్మిస్తున్నారు. ఈ మూవీ ద్వారా మల్లిడి వశిష్ట్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కేథరిన్ సంయుక్త మీనన్ వారినా హుస్సేన్ హీరోయిన్ లుగా నటిస్తున్నారు. హీరో కల్యాణ్ రామ్ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో ఈ మూవీని రూపొందిస్తున్నారు.5వ సెంచరీ నాటి మగధ సామ్రాజ్య కాలానికి నేటి కాలానికి లింకప్ చేస్తూ ఈ మూవీని తెరకెక్కించారు. బింబిసారుడిగా సాధారణ యువకుడిగా ఇందులో కల్యాణ్ రాయ్ రెండు భిన్నమైన పార్శ్వాల్లో సాగే పాత్రల్లో కనిపించబోతున్నారు. సోమవారం ఈ మూవీ ట్రైలర్ ని చిత్ర బృందం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హీరో కల్యాణ్ రామ్ 'బింబిసార'పై ఆసక్తికర వ్యాఖ్యలు చేయడం ప్రధాన్యతను సంతరించుకుంది.ఆద్యంతం ఆసక్తికరంగా అబ్బురపరిచే విజువల్స్ తో .. విజువల్ గ్రాండీయర్ తో సాగిన ట్రైలర్ సినిమాపై అంచనాల్నిపెంచేసి భారీ స్థాయిలో బజ్ క్రియేట్ చేసింది. ఆగస్టు 5న భారీ స్థాయిలో ఈ మూవీని రిలీజ్ చేయబోతున్నారు. ఇదిలా వుంటే ట్రైలర్ రిలీజ్ సందర్భంగా హీరో నందమూరి కల్యాణ్ రామ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి. వచ్చే ఏడాది 'బింబిసార' పార్ట్ 2 వుంటుందని ఇందులో యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటిస్తారని స్పష్టం చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి.ఇదిలా వుంటే 'బింబిసార' 2 పార్ట్స్ కాదని మొత్తం నాలుగు భాగాలుగా కాబోతోందని తెలుస్తోంది. ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ లో చందమామ కథలని అంతే అందంగా అడాప్ట్ చేసుకుని మనం పాతాల భైరవి ఆదిత్య 369 మగధీర బాహుబలి వంటి సినిమాలని తెరపైకి తీసుకొచ్చాం. అదే పంథాలో 'బింబిసార'ని కూడా సరికొత్తగా తెరపైకి తీసుకొచ్చామన్నారు కల్యాణ్ రామ్ . అంతే కాకుండా ఈ మూవీని నాలుగు భాగాలుగా రూపొందించాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. సెకండ్ పార్ట్ వచ్చే ఏడాది 2023 ఆగస్టులో రిలీజ్ అవుతుంది.అన్నీ సవ్యంగా సాగితే తారక్ నేను కలిసి సీక్వెల్ లో నటిస్తాం' అని కల్యాణ్ రామ్ వెల్లడించడంతో ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. ఈ మూవీ ఫ్రాంచైజీస్ కోసం హీరో నందమూరి కల్యాణ్రామ్ మైండ్ లో వున్న మాస్టర్ ప్లాన్ ఏంటన్నది ఎవరికీ అంతుచిక్కడం లేదు.ఫస్ట్ పార్ట్ రిలీజ్ కి ముందే మొత్తం నాలుగు పార్ట్ లు చేస్తామని చెప్పడం వెనక ఎలాంటి మాస్టర్ ప్లాన్ ని సిద్ధం చేసుకున్నారన్నది అందరిని ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. హరి కృష్ణ కె నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి మల్లిడి వశిష్ట్ దర్శకత్వం వహిస్తున్నారు. చోటా కె. నాయుడు ఛాయాగ్రహణం ఎం.ఎం. కీరవాణి నేపథ్య సంగీతం సాంగ్స్ కి చిరంతన్ భట్ సంగీతం అందిస్తున్నారు.


# నేను ఏదైనా స్ట్రెయిట్ గా చెప్తా.. డబుల్ మీనింగ్ ఉండదు: నాగచైతన్య

యువసామ్రాట్ అక్కినేని నాగచైతన్య నటించిన లేటెస్ట్ మూవీ "థ్యాంక్యూ". విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో రాశీఖన్నా - మాళవికా నాయర్ - అవికా గోర్ హీరోయిన్లుగా కనిపించనున్నారు. జులై 22న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కాబోతోంది. ఈ నేపథ్యంలో మూవీ ప్రమోషన్స్ లో భాగంగా చైతూ - రాశీ కలిసి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏవైనా మూడు డబుల్ మీనింగ్ పదాలు చెప్పాలని నాగచైతన్య ని కోరాడు యాంకర్. దీనికి చై స్పందిస్తూ.. తనకు డబుల్ మీనింగ్ పదాలు తెలియవని చెప్పారు. ఏదైనా ఉంటే స్ట్రెయిట్ గా చెప్తానని.. అందులో డబుల్ మీనింగ్ ఉండదని తెలిపారు. అంతేకాదు డబుల్ మీనింగ్ పదాలు ఏంటో తననే చెప్పమని తిరిగి యాంకర్ ని ప్రశ్నించారు అక్కినేని హీరో.స్ట్రెయిట్ గా ఉండేవారి దగ్గర డబుల్ మీనింగ్స్ ఉండవని.. ఏదైనా నేరుగా పాయింట్ గురించి మాట్లాడతారని చైతన్య చెప్పారు. 'హాట్' అనే పదం వినగానే గుర్తొచ్చే ముగ్గురు వ్యక్తుల పేర్లు చెప్పమని అడగ్గా.. ఏంజిలీనా జూలీ - డానియేల్ క్రెయిగ్ - జెస్సికా అని చెప్పారు చై.బ్యాడ్ డేట్ నుంచి తప్పించుకోడానికి మార్గాలు చెప్పమంటే.. అది ఎలాంటిదైనా తాను ఎస్కేప్ చేయనని.. ఆ డేట్ ని ఫినిష్ చేస్తానని చైతూ తెలిపారు. అవతలి వ్యక్తిని బాధ పెట్టకూడదనే ఉద్దేశ్యంతో చై బ్యాడ్ డేట్ అయినప్పటికీ.. ఫినిష్ చేస్తానని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. చైతన్య నిజంగా హానెస్ట్ పర్సన్ అని.. స్వీట్ హార్టెడ్ పర్సన్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.ఇదిలా ఉంటే 'మనం' వంటి క్లాసిక్ తర్వాత నాగచైతన్య మరియు విక్రమ్ కుమార్ కాంబినేషన్ లో రూపొందిన "థాంక్యూ" సినిమాపై మంచి అంచనాలున్నాయి. ఇందులో మూడు వైవిధ్యమైన లుక్స్ లో చైతు కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది.శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ పై దిల్ రాజు - శిరీష్ 'థాంక్యూ' సినిమాని నిర్మించారు. బీవీఎస్ రవి కథ అందించిన ఈ సినిమాకు హర్షిత్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఎస్ఎస్ థమన్ సంగీతం సమకూర్చారు. లెజండరీ పీసీ శ్రీరామ్ సినిమాటోగ్రఫీ అందించగా.. నవీన్ నూలి ఎడిటింగ్ వర్క్ చేశారు.సమంత తో విడాకుల ప్రకటన తర్వాత నాగచైతన్య నుంచి రాబోతున్న మూడో సినిమా ఇది. 'మజిలీ' 'వెంకీమామ' 'లవ్ స్టోరీ' 'బంగార్రాజు' వంటి వరుస విజయాలతో జోష్ మీదున్న నవ యువసామ్రాట్.. 'థాంక్యూ' చిత్రంతో ఎలాంటి సక్సెస్ అందుకుంటారో చూడాలి.



# ఫ్యాన్స్ బాధ కాస్త అర్థం చేసుకో డార్లింగ్..!

సినీ హీరోలను తమ అభిమానులు ఎంతగా ఆరాదిస్తారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఎలాంటి రక్త సంబంధం లేకపోయినా వారిని తమ కుటుంబ సభ్యులుగా భావిస్తుంటారు.. డెమి గాడ్స్ గా కొలిచే డైహార్డ్ ఫ్యాన్స్ కూడా ఉన్నారు. వారికి భారీ కటౌట్లు కట్టి క్షీరాభిషేకాలు చేయడమే కాదు.. రక్త తిలకాలు దిద్దుతుంటారు. బర్త్ డేలు వస్తే ఒక పండుగలా గ్రాండ్ గా సెలబ్రేషన్స్ చేస్తుంటారు. కేకులు కట్ చేస్తారు.. అన్నదాన రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.అయితే అభిమానులు ఎంత గుండెలు బాదుకున్నా.. గుండీలు తెంపుకున్నా.. తమ ఫేవరేట్ హీరోలను నేరుగా కలిసే భాగ్యం ఏ కొందరికో దక్కుతుంది. ఫ్యాన్స్ పై ఎంత ప్రేమ ఉన్నా.. కలవాలనే ఆరాటం ఉన్నా.. హీరోలకు అందుకు తగిన సమయం.. అలాంటి పరిస్థితులు దొరకవు. అందుకే కొందరు హీరోలు కేవలం తమ వీరాభిమానుల కోసమే ఫ్యాన్స్ మీట్స్ ఏర్పాటు చేస్తుంటారు. ఫోటోలు దిగి కాసేపు వారితో సమయం



గడుపుతుంటారు.టాలీవుడ్ లో చాలామంది హీరోలు తమ అభిమానుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంటారు. వీలు కుదిరినప్పుడల్లా వారితో కలవడానికి ప్రాధాన్యం ఇస్తుంటారు. అయితే ఈ విషయంలో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఫ్యాన్స్ కు నిరాశ తప్పడం లేదు. 'బాహుబలి' చిత్రంతో పాన్ ఇండియా స్టార్ గా మారిపోయిన డార్లింగ్.. అభిమానులకు అందుబాటులో ఉండటం లేదనే కామెంట్స్ ఉన్నాయి.సినిమా ఫంక్షన్స్ లో తప్ప ప్రభాస్ పెద్దగా ఫ్యాన్స్ తో కలిసిన సందర్భాలు లేవు. తమ అభిమాన హీరో వైఖరి పట్ల డార్లింగ్ ఫ్యాన్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెలగక్కుతున్నారు. ఫ్యాన్స్ ను నిర్లక్ష్యం చేయొద్దని.. వారి కోసం కాస్త టైం కేటాయించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ముగ్గురు డై హార్డ్ ఫ్యాన్స్ నేరుగా ప్రభాస్ ఇంటికే చేరుకొని నిరాశ వ్యక్తం చేశారు..యంగ్ రెబల్ స్టార్ అభిమానులు ముగ్గురు కాలి నడకన హైదరాబాద్ లోని అతని ఇంటికి చేరుకుని ఒక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. "ఎన్నో ఇబ్బందులు పడి అన్నయ్య ఇంటికి చేరుకున్నాం. అయితే మనం ఎక్సపెక్ట్ చేసిందే ఇక్కడ జరిగింది. 'సార్ ఊర్లో లేరు.. బిజీగా ఉన్నారు. పీఏ డ్యూటీకి సెలవు పెట్టారు' అని చెబుతున్నారు" అని డార్లింగ్ ఫ్యాన్స్ తెలిపారు."మేం ఇప్పుడు ఏం ఇష్యూ చేయం. సార్ ఎప్పుడు వస్తే అప్పుడు ఆయన్ని కలిసి ఫోటో దిగిన తర్వాతే ఇక్కడి నుంచి వెళతాం. ఏదేమైనా సరే అప్పటి వరకూ ఒక్కడే ఉంటాం" అని అభిమానులు వీడియోలో పేర్కొన్నారు. అయితే జూలై 15న ప్రభాస్ ఇంటికి వెళ్లి ఫ్యాన్స్ మీట్ గురించి మాట్లాడటానికి కొద్ది రోజుల క్రితం అభిమాన సంఘం ప్రెసిడెంట్ ప్లాన్ చేసుకున్నారు. అయితే ఆలోపే కొందరు ప్రభాస్ ఇంటికి వెళ్లడం ప్రారంభించారు. మరి ఇప్పటికైనా అభిమానుల మొర ఆలకించి వారికి కాస్త సమయం ఇస్తారేమో చూడాలి.

# అక్కడైతే ఇంగ్లండ్‌దే పైచేయి... మరి ఏం జరుగుతుందో?




టీమిండియా- ఇంగ్లండ్ మధ్య గురువారం(జూలై 7) నుంచి టీ20 సిరీస్ ఆరంభం కానుంది. సౌతాంప్టన్ వేదికగా మొదటి మ్యాచ్ జరుగనుంది. టీమిండియా పగ్గాలు చేపట్టిన రోహిత్ శర్మ ఈ సిరీస్‌తో తొలిసారిగా విదేశీ గడ్డపై భారత్ తలపడే మ్యాచ్‌కు సారథిగా వ్యవహరించనున్నాడు. రీషెడ్యూల్డ్ టెస్టుకు ముందు కోవిడ్ బారిన పడిన అతడు.. కోలుకున్న కోలుకున్న సంగతి తెలిసిందే.ఇదిలా ఉంటే.. రీషెడ్యూల్డ్ టెస్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన జస్‌ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, బ్యాటర్లు రిషభ్ పంత్, శ్రేయస్ అయ్యర్‌లకు విశ్రాంతినిచ్చిన నేపథ్యంలో మొదటి మ్యాచ్‌కు వారు దూరంగా ఉంటారు. మరి పటిష్ట జట్లు అయిన టీమిండియా-ఇంగ్లండ్ మధ్య టీ20 ఫార్మాట్‌లో ముఖాముఖి రికార్డులు, ఎవరిది పైచేయి? మ్యాచ్ ఎప్పుడు, ఎక్కడ జరుగనుంది? ప్రత్యక్ష ప్రసారం, తుది జట్ల అంచనా తదితర వివరాలు తెలుసుకుందాం!భారత్- ఇంగ్లండ్ మధ్య ఇప్పటి వరకు మొత్తం 19 టీ20 మ్యాచ్‌లు జరిగాయి. 10 మ్యాచ్‌లలో టీమిండియా గెలవగా, తొమ్మిదింట ఇంగ్లండ్ విజయం సాధించింది. అయితే, ఇంగ్లండ్ గడ్డపై ఇరు జట్లు ఆరుసార్లు తలపడ్డాయి. ఇందులో నాలుగు సార్లు ఇంగ్లండ్, రెండుసార్లు భారత్ గెలుపొందాయి.

మ్యాచ్ ఎప్పుడు, ఎక్కడ?

ఇండియా వర్సెస్ ఇంగ్లండ్ మొదటి టీ20

తేదీ: జూలై 7

వేదిక: ది రోజ్ బౌల్ స్టేడియం, సౌతాంప్టన్

సమయం: భారత కాలమానం ప్రకారం రాత్రి పదిన్నర గంటలకు(10:30 ఖఓ)

ప్రత్యక్ష ప్రసారం: సోనీ సిక్స్‌లో

తుది జట్ల అంచనా:

టీమిండియా:రోహిత్ శర్మ(కెప్టెన్), ఇషాన్ కిషన్, దీపక్ హుడా, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, దినేశ్ కార్తిక్(వికెట్ కీపర్ బ్యాటర్), అక్షర్ పటేల్, హర్షల్ పటేల్, భువనేశ్వర్ కుమార్, ఆవేశ్ ఖాన్, యజువేంద్ర చహల్.

ఇంగ్లండ్:జోస్ బట్లర్(కెప్టెన్, వికెట్ కీపర్), జేసన్ రాయ్, డేవిడ్ మలన్, మొయిన్ అలీ, లియామ్ లివింగ్‌స్టోన్, ఫిల్ సాల్ట్, హ్యారీ బ్రూక్, సామ్ కరన్, రిచర్డ్ గ్లీసన్, క్రిస్ జోర్డాన్, మాథ్యూ పార్కిన్సన్.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190